www.visalaandhra.com

శుక్రవారం
15-12-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 173
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

జీ20 సదస్సు ఖర్చు రూ.416 కోట్లు

న్యూఢిల్లీ: భారత్ అధ్యక్షతన జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.416 కోట్లు ఖర్చు చేసింది. ఈ వివరాలను పార్లమెంట్‌కు గురువారం కేంద్ర విదేశాంగ సహాయ మంత్రి మురళీధరన్ తెలిపారు. జీ20 సదస్సుకు రూ.1,310 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు చెప్పారు. డిసెంబర్ 11నాటికి రూ.416.19 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. సమావేశాల నిర్వహణకు రూ.161.05 కోట్లు, హోటళ్లు, సమావేశ వేదికలకు రూ.118 కోట్లు, రవాణా కోసం రూ.49.02 కోట్లు, ప్రత్యేక విమానాలకు రూ.7.36 కోట్లు, విజ్ఞాన భాగస్వాముల గ్రాంట్లకు రూ.3.42 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు.

విపత్తుకూ స్పందించరా ?

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై భగ్గుమన్న రైతులు
- సీపీఐ పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు
- పాలకులు స్పందించకుంటే రాష్ట్ర బంద్: నారాయణ హెచ్చరిక
- ఢిల్లీ స్థాయిలో ఉద్యమానికి సిద్ధం కావాలి: రామకృష్ణ

8లో

మిచౌంగ్ తుపానుకు తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని తక్షణం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు గురువారం రాష్ట్రవ్యాప్తంగా ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో పార్టీల కతీతంగా రైతు సోదరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట మొత్తం సర్వనాశనమైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఏమాత్రం చలనం లేకపోవడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రశ్నిస్తే సస్పెన్షన్

- 14 మంది ఎంపీలపై వేటు
- లోక్‌సభలో 13 మంది- రాజ్యసభలో ఒకరు
- భద్రతా వైఫల్యంపై ప్రభుత్వ ప్రకటనకు విపక్షాల డిమాండ్
- సమాధానానికి ముందుకు రాని సర్కార్
- అట్టుడికిన చట్టసభలు - వాయిదాలతో సరి
- ఎనిమిది మంది భద్రతా సిబ్బందిపై వేటు
- మోదీ ఉన్నతస్థాయి సమీక్ష

న్యూఢిల్లీ: లోక్‌సభకు భద్రతా వైఫల్యంపై గురువారం పార్లమెంటు దద్దరిల్లింది. దీనికి మోదీ సర్కారు సమాధానం చెప్పాలని, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభకు రావాలని ప్రతిపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. పార్లమెంటు భద్రతకు సంబంధించి ఘోర వైఫల్యం జరిగినా మోదీ సర్కారు స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. పార్లమెంటు ఉభయసభల్లోనూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా విపక్ష ఎంపీలు నినాదాలు చేశారు. ఎంపీల భద్రతపై కనీస స్పందన కనిపించడం లేదని నిందించారు. ప్రభుత్వ ఘోర వైఫల్యానికి సమాధానం చెప్పడానికి బదులు...ఆందోళనకు దిగిన విపక్ష ఎంపీలను సస్పెండ్ చేశారు. లోక్‌సభలో 13 మందిని, రాజ్యసభ నుంచి ఒకరిని సస్పెండ్ చేశారు. సస్పెన్షన్లపైనా ప్రతిపక్ష ఎంపీలు ఆగ్రహం వెలిబుచ్చారు. పార్లమెంటులో భద్రతా వైఫల్యంపై చర్చకు ప్రతిపక్షాలు డిమాండ్ చేయడంతో ఉభయ సభలు దద్దరిల్లాయి. లోక్‌సభ ఘటనపై ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటన చేయాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. వెల్‌లోకి వెళ్లి నినాదాలు చేశారు. దీంతో సభ కార్యకలాపాలకు విఘాతం కలిగిందన్న నెపంతో 14 మంది ఎంపీలను సస్పెండ్ చేశారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు ముగిసేంత వరకు సభలకు రావద్దని సభాపతులు హుకుం జారీ చేశారు. సభ నిబంధనలు ఉల్లంఘించడం, క్రమశిక్షణా రాహిత్యంగా వ్యవహరించడంతో సెషన్ నుంచి సస్పెండ్ చేశామని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్ చెప్పారు. పార్లమెంటు భద్రతపై జవాబుదారీతనాన్ని ప్రశ్నించిన ఎంపీలపై చర్యలకు దిగిన ఆ ఇద్దరు...చొరబాటుదారులకు పాసులిచ్చిన బీజేపీ ఎంపీపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. సస్పెండైన 14 మందిలో లోక్‌సభ ఎంపీలు 13 మంది, ఒకరు రాజ్యసభ ఎంపీ ఉన్నారు. పార్లమెంటు భద్రతా వైఫల్యంపై ప్రభుత్వ ప్రకటన కోసం లోక్‌సభ, రాజ్యసభలో ప్రతిపక్ష ఎంపీలు పట్టుబట్టడంతో ఉభయ సభలు అట్టుడికిపోయాయి. సభల్లో గందరగోళం సృష్టించారంటూ స్పీకర్ ఓం బిర్లా, చైర్మన్ ధన్కర్ ఆయా ఎంపీలపై చర్యలు తీసుకున్నారు. సస్పెండ్ అయిన వారిలో తొమ్మిది మంది కాంగ్రెస్ ఎంపీలు కాగా సీపీఎం నుంచి ఇద్దరు, సీపీఐ, డీఎంకే, టీఎంసీ నుంచి ఒక్కొకరు ఉన్నారు. తొలుత డీఎంకే ఎంపీ ఎస్ఆర్ పార్తిబన్ పేరు కూడా ఈ జాబితాలో ఉంది. ఆయన సభలో లేరని తెలిసి ఆ పేరును తొలగించారు. సీపీఐ ఎంపీ కె.సుబ్బరాయన్, కాంగ్రెస్ ఎంపీలు మాణిక్యం ఠాకూర్, ఎండీ జావేద్, వీకే శ్రీకందన్, బన్ని బహానన్, డీఎంకే ఎంపీ కె.కణిమొళి, సీపీఎం ఎంపీలు పీఆర్ నటరాజన్, ఎస్.వెంకటేశ్వన్ లోక్‌సభ నుంచి, తృణమూల్ కాంగ్రెస ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్ రాజ్యసభ నుంచి సస్పెండ్ అయ్యారు. డెరెక్ వ్యవహారం సభా హక్కుల కమిటీ పరిశీలనకు వెళ్లింది. మరోవైపు పార్లమెంటు భద్రతపై ప్రధాని మోదీ ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. హోంమంత్రి అమిత్ షా, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్రమంత్రులు ప్రహ్లాద్ జోషీ, అనురాగ్ ఠాకూర్, పీయూష్ గోయల్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. భద్రతా వైఫల్యంపై లోక్‌సభ సెక్రటేరియట్ చర్యలకు ఉపక్రమించి, విధుల్లో ఉన్న ఎనిమిది మంది భద్రతా అధికారులను సస్పెండ్ చేసింది. ఈ ఘటనకు కారణమైన నలుగురిని ఢిల్లీ పోలీసులు విచారించారు. ప్రత్యేక న్యాయమూర్తి హరదీప్ కౌర్ ఎదుట హాజరు పరిచి 15 రోజుల కస్టడీని కోరారు. అయితే

- మిగతా 2 లో

150 మందిని మార్చినా
వైసీపీ గెలవదు

ప్రజాభిప్రాయంతోనే టికెట్ల కేటాయింపు
చంద్రబాబు కీలక వ్యాఖ్యలు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఓటమి భయంతోనే సీఎం జగన్ పెద్దఎత్తున అభ్యర్థులను మారుస్తున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. 2024లో జరిగే ఎన్నికలు 5 కోట్ల మంది ప్రజలకు, నియంత జగన్‌రెడ్డికి మధ్య జరుగుతున్న యుద్ధమని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీలు, వ్యక్తులు కాదు....రాష్ట్రం గెలవాలన్నారు. జగన్ 150 మంది అభ్యర్థులను మార్చినా వైసీపీ గెలవదని చంద్రబాబు స్పష్టం చేశారు. జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని, రాష్ట్రంలో ఇంత విఫల ముఖ్యమంత్రిని తాను ఎప్పుడూ చూడలేదన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చంద్రబాబు గురువారం మాట్లాడారు. మిచౌంగ్ తుపాను కనీవినీ ఎరుగని రీతిలో రైతాంగాన్ని నష్ట పరిచిందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 15 జిల్లాల్లో దాదాపు 22 లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగిందని, తుపాను వస్తుందని ముందుగా తెలిసి కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. ముందే స్పందించి తగిన శ్రద్ధ తీసుకొని ఉంటే చాలావరకు నష్టాన్ని నివారించే అవకాశముండేదన్నారు. తుపాన్లు, ఇతర ప్రకృతి విపత్తులను నిలువరించలేమని, కానీ నష్టాన్ని తగ్గించుకోవడానికి ముందు జాగ్రత్తలు

- మిగతా 2 లో

'ఉద్దానం' సమస్యకు శాశ్వత పరిష్కారం

- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- పలాసలో 200 పడకల కిడ్నీ ఆస్పత్రి ప్రారంభం
- మకరాంపురంలో వైఎస్ఆర్ సుజలధార ప్రాజెక్టు జాతికి అంకితం

విశాలాంధ్ర-పలాస : శ్రీకాకుళం జిల్లాలోని కిడ్నీ వ్యాధి ప్రభావిత ఉద్దానం ప్రాంతాలైన 7 మండలాల్లో గ్రామాలకు రక్షిత మంచినీటి పథకాన్ని అందించే డాక్టర్ వైఎస్ఆర్ సుజలధార పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. కిడ్నీ రోగుల కోసం రీసెర్చ్ సెంటర్‌ను కూడా ప్రారంభించారు. ఉద్దానం కిడ్నీ వ్యాధి గ్రస్తుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చేసేందుకు కృషి చేస్తున్నానని, ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఉద్దాన ప్రజల కష్టాలను నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నానని సీఎం వెల్లడించారు. గురువారం పలాసలో రూ.85 కోట్ల తో నిర్మించిన వైఎస్ఆర్ కిడ్నీ పరిశోధన కేంద్రం-200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని, మకరాంపురం వద్ద రూ.700 కోట్లతో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ సుజలధార మంచి నీటి ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. పలాస మండలం రామక్రిష్టాపురం వద్ద ఏర్పాటు చేయనున్న పారిశ్రామికవాడ,

- మిగతా 2 లో

రిషికొండ అక్రమాలపై నివేదిక ఇవ్వండి

కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించిన హైకోర్టు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రిషికొండ అక్రమ నిర్మాణాలపై హైకోర్టులో గురువారం అనుబంధ పిటిషన్ దాఖలైంది. పరిశీలనకు వచ్చిన కమిటీకి అక్రమాలపై పిటిషన్ ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ విశాఖ జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ తరపున పిటిషన్ దాఖలైంది. కమిటీ పర్యటన పూర్తయిందని కేంద్ర ప్రభుత్వ

- మిగతా 2 లో

మార్చిలో పది, ఇంటర్ పరీక్షలు

- షెడ్యూలు విడుదల
- 1 నుంచి ఇంటర్, 18 నుంచి టెన్త్
- ఫిబ్రవరి 5 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్
- ఏడు సబ్జెక్టులకే 'పది' పరీక్షలు
- విద్యామంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడి

2లో

రాష్ట్రంలో ఇంటర్, పదో తరగతి పరీక్షల నిర్వహణ షెడ్యూలును రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. 2023-24 విద్యా సంవత్సరానికి గాను, వచ్చే ఏడాది మార్చి 1 నుంచి 25వ తేదీ వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలను, మార్చి 18వ తేదీ నుంచి 30 వరకు పది పరీక్షలను నిర్వహిస్తారు.

ఇదీ లోకం!

ఒరే నాయనా.. నేను టీ తాగి వస్తాను పార్టీని వదిలి పోవటంలేదు నన్నొదల్రా!

ఓట్ల అక్రమాలు

- సీఈసీకి వైసీపీ, టీడీపీ పరస్పర ఫిర్యాదులు
- మై టీడీపీ యాప్‌తో టీడీపీ మాల్‌ప్రాక్టీస్: విజయసాయి
- అధికారబలంతో దొంగ ఓట్ల చేర్పింపు: కనకమేడల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఓట్ల అక్రమాలపై అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు గురువారం పోటాపోటీగా ఫిర్యాదు చేశారు. అధికారం అడ్డుపెట్టుకొని వైసీపీ పెద్దఎత్తున దొంగ ఓట్లు చేర్పిస్తోందని టీడీపీ ఫిర్యాదు చేయగా...ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఎన్నికల సంఘం డేటాను టీడీపీ దుర్వినియోగం చేస్తోందని వైసీపీ ఆరోపించింది. వైసీపీ, టీడీపీ ప్రతినిధి బృందాలు వేర్వేరుగా కేంద్ర ఎన్నికల

- మిగతా 2 లో

ఇండస్ ఆసుపత్రిలో మంటలు

- రోగులకు తప్పిన ముప్పు
- 47 మంది తరలింపు
- ప్రమాదంపై విచారణకు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ నగరం జగదాంబ కూడలి సమీపంలోని ఇండస్ ఆస్పత్రిలో గురువారం అగ్నిప్రమాదం సంభవించింది. ఆస్పత్రిలోని మొదటి అంతస్తు ఆపరేషన్ థియేటర్లో మంటలు ఎగసిపడ్డాయి. ఆ తర్వాత మిగిలిన అంతస్తులకు దట్టమైన పొగలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తేవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఆస్పత్రిలోని సుమారు 47 మంది రోగులను అంబులెన్స్‌లో వివిధ ఆస్పత్రులకు తరలించారు. ఇందులో ఐసీయూ లో చికిత్స పొందుతున్న 17 మంది ఉన్నారు. పై అంతస్తుల్లోని అత్యవసర విభాగాల్లో ఉన్న రోగులను నిచ్చెనల సహాయంతో కిందికి దింపారు. ఈ ప్రమాదంతో రోగులు, వారి బంధువులు భయభ్రాంతులకు గురయ్యారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆస్పత్రి మొదటి అంతస్తులో మంటలంటుకున్నాయని విశాఖ సీపీ రవిశంకర్ తెలిపారు. రోగులను వేరే ఆస్పత్రికి తరలించామని, పొగలు దట్టంగా వ్యాపించడంతో గందరగోళం ఏర్పడిందని చెప్పారు. మొత్తం 12 ఫైర్ ఇంజిన్లు మంటలను అదుపు చేసినట్లు పేర్కొన్నారు. కాగా ఇండస్ హాస్పిటల్స్ 2వ అంతస్తులో 'నైట్రస్ ఆక్సైడ్ లీకేజీ' కారణంగా అగ్ని ప్రమాదం సంభవించిందని అధికారులు తెలియజేశారు. రెవెన్యూ, అగ్నిమాపక, పోలీసు, వైద్యశాఖల ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. చికిత్స పొందుతున్న వారిని సమీపంలోనే ఉన్న మెడికోవర్, విజేత ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి నిలకడగా ఉందని జిల్లా

- మిగతా 2 లో

బైడెన్‌పై అభిశంసన

అవినీతి విచారణకు ప్రతినిధుల సభ ఆమోదం



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌పై అభిశంసనకు రిపబ్లికన్లు ప్రయత్నిస్తున్నారు. బైడెన్‌పై అవినీతి ప్రతినిధుల సభ ఆమోదించింది. సెనేట్ దర్యాప్తులో బైడెన్ దోషిగా తేలితే అధ్యక్ష పదవిని కోల్పోతారు. అయితే ఈ ప్రక్రియ సమయంతో కూడుకొన్నది. బైడెన్‌పై అభిశంసనకు అర్థరహిత ప్రయత్నాలు జరుగుతున్నాయని శ్వేతసౌధం దుయ్యబట్టింది. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ న్యాయచిక్కుల్లో ఉన్నందున ఆయన మీద నుంచి దృష్టిని మళ్లించేందుకు రిపబ్లికన్లు యత్నిస్తున్నారని విమర్శించింది. బైడెన్‌పై అభిశంసనకు తగిన ఆధారాలు లేవని రిపబ్లికన్ పార్టీ సభ్యులలే అంగీకరించినట్లు వెల్లడించింది. ఇది రాజకీయ గిమ్మిక్కు అని, దీనికి విశ్వసనీయత, న్యాయబద్ధత లేవని డెమొక్రాట్లు ఆక్షేపించారు. రిపబ్లికన్ పార్టీ ప్రతినిధులంతా బైడెన్‌పై విచారణకు ఓటేశారు. బైడెన్ అవనితి, ఆయన కుటుంబ సభ్యుల వ్యాపారాల విషయంలో ఏడాదిగా విచారణ జరుగుతోంది. ఆయన అక్రమాలకు పాల్పడినట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఇప్పటివరకు జరిగిన విచారణలో పురోగతి లేదని, ఇక అభిశంసనే తరువాయి అని రిపబ్లికన్లు అన్నారు. అవినీతి, అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు బైడెన్‌పై ఆరోపణలు ఉన్న విషయం విదితమే.

ఉ.గాజాలో ఆకస్మిక దాడి

10 మంది ఇజ్రాయిలీ సైనికుల మృతి

జెరూసలేం: ఉత్తర గాజాలో జరిగిన ఆకస్మిక దాడిలో తొమ్మిది మంది ఇజ్రాయిలీ సైనికులు మరణించారు. మరోచోట ఒకరు మృతి చెందారు. దీంతో ఇప్పటి వరకు ఇజ్రాయిల్ సైనికులు 115 మంది ప్రాణాలు కోల్పోయారు. తాజాగా చనిపోయిన తొమ్మిది మందిలో ఇద్దరు కమాండర్లు ఉన్నారు. గొలానీ బ్రిగేడ్ కమాండ్ల బృందానికి అధిపతి ఐజాక్ బెన్, ఒక కల్నల్, మేజర్‌తోపాటు కమాండర్లు మృతి చెందారు. అయితే ఇప్పటివరకు చనిపోయిన సైనికుల్లో పది శాతం మంది ప్రమాదవశాత్తు మరణించారని ఇజ్రాయిల్ రక్షణ దళం (ఐడీఎఫ్) తెలిపింది. శత్రు సైన్యం అనుకొని పొరపాటున సొంత బలగాలే 13 మందిని హతమార్చగా, హమాస్ పెట్టిన ల్యాండ్ మైన్స్ తొక్కడం వంటి వివిధ కారణాలతో మరో ఏడుగురు మరణించినట్లు తెలిపింది. అలాగే హమాస్ సైనికులు ఏడు వేల మంది మేర హతమైనట్లు చెబుతోంది. అక్టోబరు7న జరిగిన దాడికి ప్రతీకారం నెపంతో హమాస్ అంతమే లక్ష్యమంటూ ఇజ్రాయిల్ ఏకపక్షంగా గాజాను శిథిలం చేస్తుండటం, వేలాది మంది పౌరుల ప్రాణాలు ముఖ్యంగా చిన్నారులు, మహిళలను చంపేస్తుండటంపై అంతర్జాతీయంగా వ్యతిరేక వస్తోంది. ఆ దేశాన్ని ఇప్పటివరకు వెనుకేసుకొచ్చిన అమెరికా కూడా తన స్వరం మార్చింది. పౌర మరణాలను తగ్గించకపోతే ప్రపంచ దేశాల మద్దతు కోల్పోవాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇజ్రాయిల్‌ను హెచ్చరించారు. కాల్పుల విరమణ పాటించాలని ఐక్యరాజ్య సమితి (ఐరాస) డిమాండు చేసిన కొద్ది గంటలలోనే బైడెన్ పై విధంగా స్పందించారు. భద్రత విషయంలో అమెరికాపై ఆధారపడొచ్చు కానీ ఇప్పుడున్న మద్దతు తర్వాత ఉండబోదని ఇజ్రాయిల్‌కు స్పష్టంచేశారు. ఇప్పటివరకు గాజాలో 18,500 మంది చనిపోయారు. మరో 50వేల మందికిపైగా ఆచూకీలేరు. పసిప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. వైద్య వ్యవస్థ కుదేలైంది. 23 లక్షల జనాభాకు 11 ఆసుపత్రులు పాక్షికంగా పనిచేస్తున్నాయి.

గాజాలో కాల్పుల విరమణకు మద్దతివ్వండి

ఇజ్రాయిల్‌కు నిధులు ఆపండి

బైడెన్‌కు సెనేటర్ బెర్ని శాండర్స్ పిలుపు

వాషింగ్టన్: గాజాపై ఇజ్రాయిల్ సుమారు 70 రోజులుగా భీకర దాడులు చేస్తోంది. ఉత్తర గాజాను శిథిలం చేసింది. దక్షిణ గాజా, ఖాన్ యూనియన్‌లోనూ భూతల, వైమానిక దాడుల తీవ్రత పెంచింది. అక్టోబరు 7 నుంచి 18,500 మందికిపైగా పలస్తీనియన్లు ఇజ్రాయిల్ దాడుల్లో చనిపోయారు. వీరిలో సగానికిపైగా చిన్నారులు, మహిళలు ఉండటంతో ఇజ్రాయిల్‌పై వ్యతిరేకత పెరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు పెద్దఎత్తున సాగుతున్నాయి. ఇజ్రాయిల్‌కు వెన్నుదన్నుగా నిలిచిన అమెరికాలోనూ మద్దతు క్రమంగా తగ్గుతోంది. ఆ దేశానికి చెందిన సెనేటర్ తాజాగా ఇజ్రాయిల్ తీరును ఖండించారు. గాజాలో కాల్పుల విరమణకు పిలుపు ఇచ్చేందుకు విముఖత ప్రదర్శించిన ఆయన ఎట్టకేలకు స్పందించారు. స్వీయప్రకటిత సోషలిస్టు, వెర్మాంట్ సెనేటర్ బెర్నీ శాండర్స్ ఓ ప్రకటనలో మానవతా కాల్పుల విరమణ కోసం ఐరాసకు మద్దతివ్వాలని, ఇజ్రాయిల్ పోరునకు నిధులు ఆపేయాలని అధ్యక్షుడు బైడెన్‌కు పిలుపునిచ్చారు. ఇంకో 10.1 బిలియన్ డాలర్లను సైనికపరమైన సాయంగా అందిస్తే ఆ మొత్తం దాడులను తీవ్రతరం చేసేందుకు నెతన్యాహు ప్రభుత్వం వినియోగిస్తుంది. విచక్షణారహితంగా బాంబులతో దాడులు చేస్తుంది. మీ మద్దతును ఉపసంహరించుకోవాలని కోరుతున్నా' అని బైడెన్‌నుద్దేశించి శాండర్స్ పేర్కొన్నారు. కాల్పుల విరమణ కోసం ఐరాస సర్వసభ సమావేశం చేసిన తీర్మానానికి మద్దతివ్వాలని ఆయన కోరారు.

మార్చిలో పది, ఇంటర్ పరీక్షలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో ఇంటర్, పదో తరగతి పరీక్షల నిర్వహణ షెడ్యూలును రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. 2023-24 విద్యా సంవత్సరానికి గాను, వచ్చే ఏడాది మార్చి 1 నుంచి 25వ తేదీ వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలను, మార్చి 18వ తేదీ నుంచి 30 వరకు పది పరీక్షలను నిర్వహిస్తారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను ఫిబ్రవరి 5 నుంచి 20వరకు నిర్వహిస్తారు. ఇంటర్, టెన్త్ పరీక్షల షెడ్యూలును గురువారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. ఏప్రిల్‌లో ఎన్నికలు ఉన్నందున టెన్త్‌తోపాటు ఇంటర్ పరీక్షలను మార్చిలోనే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇంటర్ పరీక్షలను ఒక రోజు ప్రథమ, తర్వాత రోజు ద్వితీయ సంవత్సర పరీక్షలను నిర్వహిస్తారు. మార్చి 1 నుంచి 25వరకు ఇంటర్ పరీక్షలు కొనసాగుతాయి. ఇందులో ప్రధాన పరీక్షలు 15వ తేదీతోనే పూర్తవుతాయి. ఆ తర్వాత ఒకేషనల్ కోర్సు పరీక్షలను నిర్వహిస్తారు. ఇంటర్ పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. పదోత తరగతి పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు నిర్వహిస్తారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలను మొత్తంగా 10లక్షల మంది విద్యార్థులు రాయబోతున్నారు. పది పరీక్షలకు ఆరు లక్షల మంది హాజరవుతారు.

విద్యార్థుల నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి: మంత్రి బొత్స

ఈ పరీక్షలకు విద్యార్థులందరూ హాజరై నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆకాంక్షించారు. ఏప్రిల్‌లో ఎన్నికలు జరుగుతున్నందున మార్చిలో ఇంటర్‌తో పాటు పదో తరగతి పరీక్షలు కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఏడు సబ్జెక్టులకే టెన్త్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ విడత ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షను ఒకరోజు, ద్వితీయ సంవత్సర పరీక్షను మరో రోజు నిర్వహిస్తున్నామన్నారు.

పరీక్షల షెడ్యూలు ఈ విధంగా:

ఇంటర్ ప్రథమ...

(ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు)
మార్చి1- సెకండ్ లాంగ్వేజ్ 1, 4-ఇంగ్లీషు పేపర్ 1
6-మ్యాథ్స్ పేపర్ 1(ఏ), బోటనీ పేపర్ 1, సివిక్స్ పేపర్ 1
9- మ్యాథ్స్ పేపర్ 1(బి), జువాలజీ 1, హిస్టరీ 1
12- ఫిజిక్స్ 1, ఎకనామిక్స్ 1
14- కెమిస్ట్రీ 1, కామర్స్ 1, సోషియాలజీ 1, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ 1
16-పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ 1, లాజిక్ పేపర్ 1, బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్-1 (బైపీసీ వారికి)
19న మోడ్రన్ లాంగ్వేజ్ 4, జాగ్రఫీ 1

ఇంటర్ ద్వితీయ...

మార్చి 2- సెకండ్ లాంగ్వేజ్ 2, 5- ఇంగ్లీషు పేపర్ 2
7- మ్యాథ్స్ పేపర్ 2(ఏ), బోటనీ పేపర్ 2, సివిక్స్ పేపర్ 2
11- మ్యాథ్స్ పేపర్ 2(బి), జువాలజీ 2, హిస్టరీ 2
13- ఫిజిక్స్ 2, ఎకనామిక్స్ 2
15-కెమిస్ట్రీ 2, కామర్స్ 2, సోషియాలజీ 2, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్-2
18- పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ 2, లాజిక్ పేపర్ 2, బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్-2(బైపీసీ వారికి)
20న మోడర్న్ లాంగ్వేజీ 2, జాగ్రఫీ 2

పది పరీక్షల షెడ్యూలు:

మార్చి 18 నుంచి 30వరకు టెన్త్ పరీక్షలను నిర్వహిస్తారు. (ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు)
మార్చి 18- ఫస్ట్ లాంగ్వేజ్... పేపర్ 1 (గ్రూప్ ఏ)తోపాటు ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్ 1 (కాంపోజిట్ కోర్స్) , 19-సెకండ్ లాంగ్వేజ్
20-ఇంగ్లీషు, 22- మ్యాథ్స్,
23-ఫిజికల్ సైన్స్, 26-బయాలజీ
27- సోషల్ స్టడీస్ పరీక్షలు ఉంటాయి.
28- ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2 (కాంపోజిట్ కోర్స్)తోపాటు ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1 (సంస్కృతం, అరబిక్, పర్షియన్)
30- ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్ 2 (సంస్కృతం, అరబిక్, పర్షియన్)తోపాటు ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్ 2 (సంస్కృతం, అరబిక్, పర్షియన్) పరీక్షలు జరుగుతాయి.

కుట్రదారుడు లలిత్ కోసం వేట

లోక్‌సభ ఘటనపై ఢిల్లీ పోలీసుల ముమ్మర దర్యాప్తు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన పార్లమెంటులో అలజడి కేసుపై ఢిల్లీ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. విచారణలో భాగంగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. 18 నెలలుగా ఈ ఘటనకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించి కోల్‌కతాకు చెందిన లలిత్ ఝాను కీలక కుట్రదారుడిగా అనుమానిస్తున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఈ ఘటనకు 'డిసెంబరు 13 (పార్లమెంట్‌పై ఉగ్రదాడి జరిగిన రోజు)' తేదీని ఖరారు చేసింది కూడా అతనేనని తెలుస్తోంది. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన లలిత్ పరారీలో ఉన్నాడని, అతడి కోసం విస్తృతంగా గాలిస్తున్నట్లు వెల్లడించాయి. రాజస్థాన్- హరియాణా సరిహద్దులోని నీమ్రానాలో లలిత్ చివరి లొకేషన్ గుర్తించినట్లు తెలిపాయి. నిందితులకు ఉగ్ర సంస్థలతో సంబంధం ఉన్నట్లు ఆధారాలు లభించలేదని చెప్పాయి. 'విప్లవ భావజాలం కలిగిన నిందితులు దేశం దృష్టిని తమవైపు ఆకర్షించేందుకు ఈ దుస్సాహసానికి పాల్పడ్డారు. తొలుత సోషల్ మీడియాలో పరిచయమైన వీరంతా... అనంతరం ఫేస్‌బుక్‌లో ఓ ఫ్యాన్ పేజీలో చేరారు. లలిత్, సాగర్ శర్మ, మనోరంజన్ గతేడాది మైసూరులో కలుసుకున్నారు. అక్కడే వారు పార్లమెంటులోకి చొరబడేందుకు ప్రణాళిక రూపొందించారు. అనంతరం నీలం, అమోల్‌లను ఇందులో చేర్చుకున్నారు. అనేకమార్లు నిందితులు సమావేశమయ్యారు. లలిత్ ఝా ఈ బృందానికి నాయకత్వం వహించాడు. వర్షాకాల సమావేశాల సమయంలో పార్లమెంటులోని అన్ని ప్రవేశ ద్వారాల వద్ద రెక్కీ నిర్వహించమని మనోరంజన్‌కు సూచించాడు' అని పోలీసు వర్గాలు తెలిపాయి. 'జులైలో మనోరంజన్ ఢిల్లీకి వచ్చి, ఓ ఎంపీ పేరిట జారీ చేసిన విజిటర్ పాస్‌పై పార్లమెంటు లోపలికి వెళ్లాడు. అక్కడ బూట్లు తనిఖీ చేయడం లేదని గుర్తించాడు. అనంతరం డిసెంబరు 10న ఐదుగురు కలుసుకుని గురుగ్రామ్‌లోని విశాల్ శర్మ ఇంట్లో బస చేశారు. బుధవారం లలిత్, మిగతా నలుగురితో కలిసి పార్లమెంటుకు వచ్చాడు. వారిలో ఇద్దరికే పాస్ లభించడంతో... సాగర్, మనోరంజన్ లోపలికి ప్రవేశించారు. నీలం, అమోల్ గేటు వద్ద ఉన్నారు. అంతకుముందే నలుగురి ఫోన్‌లను లలిత్ తీసుకున్నాడు. మరోవైపు ఘటనాస్థలంలో స్ప్రే చేసిన రంగు డబ్బాలను అమోల్... మహారాష్ట్రలోని కల్యాణ్ నుంచి తీసుకొచ్చాడు' అని చెప్పాయి. ఘటనకు సంబంధించిన వీడియోను లలిత్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా విశాల్ శర్మకూ షేర్ చేసినట్లు చెప్పారు. మనోరంజన్, సాగర్, నీలం, అమోల్‌తోపాటు వీరికి సహకరించిన విశాల్‌ను పోలీసులు ఇప్పటికే కస్టడీలోకి తీసుకున్నారు. ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్, ఇతర భద్రతా సంస్థలు వారిని ప్రశ్నించాయి. నిందితులపై చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న లలిత్ కోసం గాలింపు ముమ్మరం చేశారు.

'ఉద్దానం' సమస్యకు శాశ్వత పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

అంబేద్కర్ యూనివర్శిటీలో నూతనంగా నిర్మించనున్న అదనపు భవనాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం పలాస రైల్వే క్రీడా మైదానంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఉద్దానంను ఉద్యానవనం అంటారని, ఈ ప్రాంతంలో గల 807 గ్రామాల ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు రక్షిత మంచినీటి ప్రాజెక్టును నిర్మించామని, అది నేడు జాతికి అంకితం చేస్తున్నామన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని, విలేజ్ క్లినిక్‌లు, ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు అండగా ఉంటామన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు మానవతాదకృదంతో అడుగులు వేస్తున్నామని, 72 డయాలసిస్ యూనిట్లను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. గతంలో రూ.2500 ఇస్తున్న పింఛనును రూ.10వేల వరకు పెంచామని, అలాగే నాన్ డయాలసిస్ రోగులకు కూడా రూ.5వేల పింఛను అందజేస్తున్నామని స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో 13వేల మందికి పైగా దయాలసిస్ రోగులకు పింఛన్లు అందజేస్తున్నామని, ప్రతి నెల పింఛన్ల కోసం 12కోట్ల 54 లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఎక్కడ ఉన్నా వారిని ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తున్నామని, ఆ ప్రాంతం ప్రజలకు నీరు అందించేందుకు వెలిగొండ ప్రాజెక్టును జనవరిలో జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. ఉద్దాన ప్రజల బాధలను 2018 పాదయాత్రలో చూశానని, కిడ్నీ సమస్య పరిష్కారిస్తానని హామీ ఇచ్చానని, అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని నెరవేర్చడంతో ఆనందంగా ఉందన్నారు.

పేదల ప్రాణాలంటే చంద్రబాబుకు లెక్కలేదు

ఈ ప్రాంతంలో కిడ్నీ బాధితుల సమస్య ఒక్క రోజులో వచ్చింది కాదని, గత పాలకుల హయాంలో కూడా ఈ సమస్య ఉందన్నారు. పేద బతుకులు ఎలా మార్చాలనే తపన మాత్రమే ఉందని, పేదల ప్రాణాలంటే చంద్రబాబుకు లెక్కే లేదని విమర్శించారు. సొంత నియోజకవర్గం కుప్పంను పట్టించుకోని చంద్రబాబుకు ఉత్తరాంధ్ర మీద ఏం ప్రేమ ఉంటుందని ప్రశ్నించారు. ఎన్నికలు వచ్చేసరికి ఎత్తులు, పొత్తులు చిత్తుల మీద, దత్తపుత్రుడు మీద కూడా ఆధార పడతారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో దత్త పుత్రుని పోటీలో పెట్టారని, ఆంధ్ర పాలకులకు చుక్కలు చూపిస్తానని తెలంగాణలో ప్రగల్భాలు పలికిన దత్తపుత్రునికి ఇండిపెండెంట్ అభ్యర్థి బర్రెలక్కకు వచ్చిన ఓట్లు కూడా రాలేదన్నారు. విశాఖను పరిపాలన రాజధాని చేస్తామంటే అడ్డుకుంటున్నారని, విశాఖకు వచ్చి ఉంటాననంటే ఏడుస్తున్నారన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99శాతం అమలు చేశామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మాయమాటలు చెప్పి హామీలిచ్చే వారిని నమ్మకూడదని సూచించారు. రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల కల నేడు సాకారమైందన్నారు. ఉద్దానంలో ప్రజల కష్టాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి ఈ ప్రాంత ప్రజలకు దైవ స్వరూపంగా మారాడని కొనియాడారు. ఉత్తరాంధ్రను ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అభివృద్ధి బాట పట్టిస్తున్నారని, మూలపేట పోర్టు నిర్మాణం, భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం ఇందుకు సాక్ష్యాలని అన్నారు. ఈ నిర్మాణాలు పూర్తయితే జిల్లా ప్రజలు ఇకపై వలసలు వెళ్లనక్కరలేదని, ఈ జిల్లాకే విరాష్ట్రాల నుంచి వలసలు వస్తారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లఠకర్, మంత్రులు విడదల రజని, ధర్మాన ప్రసాదరావు, స్పీకరు తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే ధర్మాన క్రిష్ణదాసు, కంబాల జోగులు, కళావతి, రెడ్డి శాంతి, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, దువ్వాడ శ్రీనివాసరావు, నర్తు రామారావు, వరుదు కళ్యాణి, జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయ, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆ నలుగురిపై ఉపా కేసు

న్యూఢిల్లీ: పార్లమెంటులోకి చొరబడి లోక్‌సభలో అలజడి సృష్టించిన నలుగురు దుండగులపై ఉగ్రవాద కార్యకలాపాల వ్యతిరేక చట్టం (ఉపా)తో పాటు ఐపీసీలోకి కొన్ని సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఈ దాడి సూత్రధారి లలిత్ ఝా కోసం గాలింపులు ముమ్మురంగా సాగుతున్నాయి. అనేక చోట్ల తనిఖీలు, సోదాలు జరుగుతున్నాయి. ఈ మేరకు పోలీసులు గురువారం తెలిపారు. లోక్‌సభలో దాడికి ఏ ఉగ్రసంస్థతో సంబంధాలున్నట్లు భద్రతా సంస్థలకు ఆధారాలు లభించలేదని ఓ అధికారి చెప్పారు. దర్యాప్తు క్రమంలో మరో ఇద్దరి పాత్ర గురించి తెలిసిందని, నిందితులంతా పక్కా పథకం ప్రకారం పనిచేశారన్నారు. పార్లమెంటుకు వచ్చే ముందు గురుగ్రామ్‌లో ఉండే విశాల్ శర్మ అలియాస్ విక్కీ ఇంట్లో నిందితులు బస చేసినట్లు అధికారి తెలిపారు.

నిందితులు సాగర్ శర్మ (26), మనోరంజన్ డి (34), అమోల్ షిండే (25), నీలం దేవి (37)కు రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రి వైద్యుల బృందంతో అర్ధరాత్రి వైద్య పరీక్షలు చేయించారు. ఉపా సెక్షన్లు 16 (శిక్షార్హమైన ఉగ్రవాద చర్య), 18 (శిక్షార్హమైన కుట్ర), ఐపీసీలోని 120 (నేరపూరిత కుట్ర), 452 (చొరబాటు), 153 (ఉద్దేశపూర్వకంగా అల్లర్లను రెచ్చగొట్టడం), 186 (విధి నిర్వహణలో ప్రభుత్వ అధికారిని అడ్డుకోవడం), 353 (విధులు నిర్వర్తించకుండా ప్రభుత్వ అధికారిని నిలువరించడం) సెక్షన్ల కింద పార్లమెంటు స్ట్రీట్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. చాణక్యపురిలోని దౌత్య భద్రతా దళం (డీఎస్ఎఫ్) కార్యాలయంలో ఈ నలుగురిని విచారించారు. తొలుత నీలం, అమోల్‌ను పార్లమెంటు స్ట్రీట్ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ నుంచి డీఎస్ఎఫ్ కార్యాలయానికి తరలించారు. స్పెషల్ సెల్ దర్యాప్తు క్రమంలో రెండు సంస్థల పేర్లు తెరపైకి రాగా వాటి విచారిస్తున్నట్లు సీనియర్ అధికారి చెప్పారు. దర్యాప్తు అధికారుల ప్రశ్నలకు నలుగురు ఒకే రకంగా సమాధానాలు చెబుతున్నారని, పోలీసులు పట్టుకుంటే ఏయే సమాధానాలు చెప్పాలని ముందే కూడబలుక్కున్నారని అధికారి చెప్పారు. వృత్తిరీత్యా అధ్యాపకుడైన లలిత్ కోసం ఢిల్లీ పోలీసులు సోదాలు జరుపుతున్నట్లు వెల్లడించారు. షహీద్ భగత్ సింగ్ స్ఫూర్తితో కోల్‌కతాకు చెందిన లలిత్ దేశం దృష్టిని ఆకర్షించే నేరానికి పాల్పడాలని సంకల్పించినట్లు తెలిసింది. సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమైన తర్వాత వీరంతా ఫేస్‌బుక్‌లో భగత్ సింగ్ ఫాన్ క్లబ్ పేజీలో చేరారని ఓ అధికారి చెప్పారు. లలిత్, సాగర్, మనోరంజన్‌కు ఏడాది కిందట మైసూరులో పరిచయం ఏర్పడిందని, పార్లమెంటులో చొరబడే ప్రణాళికను సిద్ధం చేసుకొన్న తర్వాత తమ ప్లాన్‌లోకి నీలం, అమోల్‌ను చేర్చారన్నారు. జులైలో పార్లమెంటు రెక్కీని మనోరంజన్ నిర్వహించినట్లు తెలిపారు.

ఈ నలుగురితో పాటు లలిత్ కూడా బుధవారం పార్లమెంటుకు రాగా రెండు పాసులు లభించడంతో అందరి ఫోన్లు తీసుకొని అతను వెళ్లిపోయాడు. స్ప్రే డబ్బాలను మహారాష్ట్రలోని కల్యాణ్ నుంచి అమోల్ కొనుగోలు చేశాడు. లలిత్ చివరి లొకేషన్ రాజస్థాన్-హరియాణా సరిహద్దు ప్రాంతమైన నీమ్రాణా వద్ద గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వీరంతా ఈనెల 10న విశాల్ శర్మ ఇంట్లో కలిశారన్నారు. అందరి సిద్ధాంతం ఒకటేనని, ప్రభుత్వాన్ని హెచ్చరించడమే వీరి ఉద్దేశమని వెల్లడించారు.

150 మందిని మార్చినా వైసీపీ గెలవదు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవచ్చన్నారు. ఈ ప్రభుత్వం ఆ విధంగా పనిచేయడంలో విఫలమైందన్నారు. గోదావరిలో వరద ముందే ప్రారంభమై పోలవరం ప్రాజెక్టుకు నీళ్లు వచ్చినప్పటికీ వాటిని వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కేవలం పట్టిసీమ ప్రాజెక్టును తాను నిర్మించాననే ఉద్దేశంతోనే నాలుగేళ్లు దాన్ని ఉపయోగించుకోలేదన్నారు. ఈ ఏడాది మాత్రం విధిలేని పరిస్థితుల్లో, ప్రజలు తంతారని భయపడి మోటార్లు ఆన్ చేశారన్నారు. అప్పటికే భారీ నష్టం జరిగిందన్నారు. ఈ ప్రభుత్వం సాగునీటి రంగంపై పూర్తిగా శీతకన్ను వేసిందని, ప్రాజెక్టులు అయినా, ప్రభుత్వ ఆస్తులైనా నిర్మించడం ఎంత ముఖ్యమో, వాటిని నిర్వహించడం కూడా అంతే ముఖ్యమని చంద్రబాబు చెప్పారు. మిచౌంగ్ వల్ల తీవ్ర పంట నష్టం జరిగినా, ప్రభుత్వం ప్రాథమిక అంచనా వేసి కేంద్రబృందానికి ఇంతవరకు చెప్పలేకపోయిందని విమర్శించారు. ఏ పంటకు ఎంత నష్టపరిహారం ఇస్తున్నారో ఇప్పటికీ చెప్పలేని దుస్థితిలో ఉన్నారని ఆయన మండిపడ్డారు. రాష్ట్రానికి, రైతాంగానికి జరిగిన నష్టాన్ని కళ్లారా చూసిన తాను మిచౌంగ్‌ను జాతీయ విపత్తుగా పరిగణించి ఆదుకోవాలని కేంద్రానికి లేఖ రాశానని గుర్తు చేశారు. దేశంలో రైతు ఆత్మహత్యల్లో మనది 3వ స్థానమైతే, కౌలురైతుల ఆత్మహత్యల్లో 2వ స్థానంలో ఉందన్నారు. తుపాను నష్టంపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న న్యాయమైన పోరాటానికి తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అణచివేతకు ప్రయత్నిస్తే పోరాటం మరింత ఉధృతమవుతుంది తప్ప తగ్గదని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ తరపున సరైన అభ్యర్థులను ఎంపిక చేస్తానని, కుప్పంలోనూ ప్రజాభిప్రాయసేకరణ చేస్తానని చంద్రబాబు వెల్లడించారు. వైసీపీ వాళ్ల ఎంపిక అంతా తాడేపల్లిలో జరుగుతుందని, తమ ఎంపిక ప్రజామోదంతోనేనన్నారు. నూతనవిధానంతో తనకు తప్ప, ఎవరికీ తెలియకుండా అభ్యర్థుల చరిత్ర తెలుసుకొని ఎంపిక చేస్తానని తెలిపారు. రాష్ట్రాన్ని కాపాడుకోవడం కోసం ప్రజలు తమతో కలిసి రావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

రిషికొండ అక్రమాలపై నివేదిక ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

న్యాయవాది ధర్మాసనానికి చెప్పారు. వెంటనే మూర్తి యాదవ్ ఇచ్చిన నివేదికను కమిటీకి పంపాలని కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిని హైకోర్టు ఆదేశించింది. రిషికొండలో తవ్విన మట్టి, రాళ్లు రప్పలను సముద్రంలో వేయడం సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. సీఆర్‌జెడ్ పరిధిలో భూగర్భ జలాల వినియోగం కూడా నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని మూర్తియాదవ్ కోర్టు దృష్టికి తెచ్చారు. రిషికొండపై జరిగిన అక్రమాలన్నింటినీ మూర్తి యాదవ్ సాక్ష్యాధారాలతో సహా కోర్టుకు సమర్పించారు. ఈ నివేదికను వెంటనే కమిటీకి పంపాలని కేంద్ర ప్రభుత్వ న్యాయవాదికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

ఓట్ల అక్రమాలు

(మొదటిపేజీ తరువాయి)

సంఘాన్ని కలిశాయి. వైసీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు వి.విజయసాయి రెడ్డి నాయకత్వంలో పార్టీ ఎంపీల బృందం కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)ని కలిసింది. సీఈసీతో భేటీ అనంతరం విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఓటర్ల జాబితా సమాచారంతో లబ్ధి పొందాలనే తెలుగుదేశం పార్టీ ప్రయత్నాలను వైసీపీ పసిగట్టిందన్నారు. 'మై పార్టీ డ్యాష్‌బోర్డ్ డాట్ కామ్' పేరిట ఆ పార్టీ వెబ్‌సైట్ కుట్రలను ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. చంద్రబాబు హయాంలో జరిగిన దొంగ ఓట్ల మాల్‌ప్రాక్టీస్‌పై అనేక అంశాలను కమిషన్‌తో సుదీర్ఘంగా చర్చించామని, వన్ సిటిజన్, వన్ ఓట్ అనే తమ పార్టీ సిద్ధాంతాన్ని తెలియపరిచామన్నారు. ప్రధానంగా ఓటర్ల కులాల వివరాలు సేకరణ, రాజకీయ పార్టీ ప్రాధాన్యతపై తెలుగుదేశం చేస్తున్న డేటా సేకరణను ఆధారాలతో సహా సీఈసీకి చెప్పామని, వాటన్నింటిపై కమిషన్ అధికారులు సానుకూలంగా స్పందించారన్నారు. ఎన్నికల కమిషన్ డ్యాష్‌బోర్డులో ఉన్న డేటా ఆధారంగా తెలుగుదేశం పార్టీ రూపొందించిన 'మై పార్టీ డ్యాష్‌బోర్డ్ డాట్‌కామ్'లో ఓటరు పేరు, ఊరు, చిరునామా, జెండర్, వయసు, కులంతోపాటు అతను మద్దతిచ్చే రాజకీయ పార్టీ, మొబైల్ నెంబర్ వంటి వివరాలున్నాయని తెలిపారు. రాజకీయ పార్టీల వారీగా ఓటర్లను వేరు చేయడమనేది చట్టవిరుద్ధమని తాము ఎన్నికల కమిషన్ దృష్టికి తెచ్చామని, తెలుగుదేశం పార్టీ సేకరించిన ఈ ఓటర్ డేటా మొత్తాన్ని అమెరికాలోని న్యూయార్క్‌లో ఒక సర్వర్ పాయింట్ వద్ద స్టోర్ చేస్తున్నారని చెప్పారు. ఇలాంటి మాల్‌ప్రాక్టీస్ గతంలోనూ టీడీపీ సేవామిత్ర యాప్ ద్వారా సేకరించడం, అప్పట్లో ఆ యాప్‌పై తాము ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం తదనంతరం దీనిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం తెలిసిందేనని గుర్తు చేశారు. ఓటరు అంగీకారంతో సంబంధం లేకుండా ఓట్లను ఉంచాలా ?, తొలగించాలా అనే సమాచారం కోసం తెలుగుదేశం పార్టీ మరో వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసుకుందన్నారు. మైపార్టీ డ్యాష్‌బోర్డు డాట్‌కామ్ ద్వారా సేకరించిన డేటా మొత్తం న్యూయార్క్ సర్వర్‌లో దాస్తుంటే, టీడీపీ మ్యానిఫెస్టో డాట్‌కామ్ వెబ్‌సైట్ డేటా మొత్తాన్ని లండన్‌లోని మరో సర్వర్‌లో స్టోర్ చేస్తున్నారని వివరించారు.

కాగా, ఆంధ్రప్రదేశ్‌లో అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర నాయకుల రాజకీయ ఒత్తిళ్లతో అక్రమ ఓటర్ల జాబితాను తయారు చేస్తున్నారని కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు టీడీపీ ఎంపీలు ఫిర్యాదు చేశారు. ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ అధ్వర్యంలో కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి జాబితా అధ్యయనానికి పరిశీలకులను నియమించాలని కోరారు. రాజకీయ ప్రతీకారం, అధికార యంత్రాంగం బలవంతం, లొంగదీసుకోవడంతో నిండిన రాజకీయ పరిస్థితులపై 2023 ఆగస్టు 29న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వ్యక్తిగతంగా వివరణాత్మక ప్రజెంటేషన్‌ను అందించారని ఆ లేఖలో తెలిపారు. 57 నెలల వైసీపీ నిరంకుశ పాలనలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ శాంతియుతంగా నిరసనలు చేపట్టినందుకు టీడీపీ ముఖ్య కార్యకర్తలపై దాదాపు 6 వేల తప్పుడు క్రిమినల్ కేసులు బనాయించారంటే పరిస్థితి తీవ్రత ఏపాటిదో అర్థమవుతుందని తెలిపారు. వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్‌లో అప్రకటిత ఎమర్జెన్సీ నెలకొందన్నారు. దురదృష్టవశాత్తు, క్షేత్రస్థాయి యంత్రాంగం, సమస్యకు ప్రధానమైన ఓటర్ల జాబితాలోని తప్పులను సరిదిద్దడానికి బదులుగా, దిగువ అధికారులను బదిలీ చేస్తూ భారత ఎన్నికల సంఘం కచ్చితమైన సూచనలను పాటించకుండా సాధారణ ధోరణి అవలంబిస్తోందన్నారు. అనుభవం లేని, రాజకీయంగా బలహీనంగా ఉన్న స్థానిక సచివాలయం సిబ్బంది బీఎల్‌ఓలుగా నియమితులై టీడీపీ మద్దతుదారులు, సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తున్నారని తెలిపారు.

ఇండస్ ఆసుపత్రిలో మంటలు

(మొదటిపేజీ తరువాయి)

అధికార యంత్రాంగం తెలిపింది. ఈ ఘటనపై విశాఖపట్నం జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. రెవెన్యూ డివిజనల్ అధికారి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్- తూర్పు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, అగ్నిమాపక అధికారి, జిల్లా కోఆర్డినేటర్ హాస్పిటల్ సర్వీసెస్‌లతో విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను విచారించి 24 గంటల్లోగా నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఇండస్ హాస్పిటల్స్ వారు వైయస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఎంప్యానెల్ చేయబడలేదని, కమిటీల నివేదికను పరిశీలించిన తర్వాత క్లినికల్ మేనేజ్‌మెంట్ చట్ట నిబంధనల ప్రకారం ఇండస్ హాస్పిటల్ పై అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రశ్నిస్తే సస్పెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

నలుగురు నిందితులను ఏడు రోజుల కస్టడీ విధిస్తూ జడ్జి ఆదేశాలిచ్చారు.

ప్రశ్నించడమే నేరమా: విపక్షాల మండిపాటు

ఎంపీల సస్పెన్షన్‌ను తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చట్టసభల్లో కేంద్ర హోంమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేసి భద్రతపై జవాబుదారీతనం లేకపోవడాన్ని ప్రశ్నించిన ఎంపీలను సస్పెండ్ చేయడం దారుణం, అప్రజాస్వామికమని ప్రతిపక్షాలు విమర్శించాయి. విచారణ పూర్తి కాకుండానే టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాను తొలగించినప్పుడు లోక్‌సభలో చొరబాటుదారులకు పాసులిచ్చిన బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహాపై చర్యలు ఎందుకు తీసుకోలేదని కేంద్రప్రభుత్వాన్ని నిలదీశాయి. 'దేశ భద్రతకు ప్రజాస్వామ్య ఆలయాన్ని ప్రమాదంలో పడవేసిన వారిని ప్రశ్నించకూడదా? ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ఖూనీ చేస్తోంది. పార్లమెంటును రబ్బరు స్టాంపుగా మార్చివేసింది. సభలో కేంద్ర హోంమంత్రిని మాట్లాడమని కోరడం నేరమా! భద్రతా వైఫల్యంపై చర్చను కోరడం నేరమా! ఎంపీలు చేసిన నేరమేమిటి? 14 మంది సస్పెన్షన్ నిరంకుశత్వానికి నిదర్శనం కాదా! అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దుయ్యబట్టారు. 'భద్రతా వైఫల్యంపై పార్లమెంటులో ప్రధాని, హోంమంత్రి మాట్లాడాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. అందుకు ఎంపీలను సస్పెండ్ చేశారు. ఇది ప్రజాస్వామ్యమా?' అని డీఎంకే ఎంపీ కనిమొళి ప్రశ్నించారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకొని విపక్షాలను బెదిరించే ప్రయత్నాలకు ప్రభుత్వం పూనుకుంటోందని జేడీయూ ఎంపీ రంజన్ సింగ్ విమర్శించారు. లోక్‌సభలో చొరబడిన వారు ముస్లింలై, పాసులిచ్చినది కాంగ్రెస్ ఎంపీ అయితే వీరి (ప్రభుత్వం) నిజ స్వరూపం తెలిసేదన్నారు. 'విపక్షమే వద్దనుకుంటే అందరినీ సస్పెండ్ చేసేయండి' అని ఎంపీ కపిల్ సిబల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మేమంతా క్షేమంగా ఉంటామని, సభలోకి చొరబడేందుకు ఆ ఇద్దరికి అనుమతిచ్చిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని దేశ ప్రజలకు చెప్పండి. ప్రస్తుత పరిస్థితిని వివరించండి' అని ప్రభుత్వాన్ని ఉద్దేశించి అన్నారు. కాంగ్రెస్ ఎంపీ కార్తి చిదంబరం స్పందిస్తూ సభలో లేని వ్యక్తిని కూడా సస్పెండ్ చేయడం హాస్యాస్పదమన్నారు. భద్రతా వైఫల్యంపై చర్చను కోరడం, ఇలాంటి ఘటన పునరావృతం కాదని ప్రకటన చేయమంటే ఎంపీలను సస్పెండ్ చేశారు' అని వ్యాఖ్యానించారు.

ఆశా వర్కర్ల సమస్యలపై ఇంత నిర్లక్ష్యమా?

- తక్షణమే డిమాండ్లు పరిష్కరించాలి
- రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): ఆరోగ్య సేవలు అందించడంలో కీలకంగా పనిచేస్తున్న ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించటంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అత్యంత దుర్మార్గంగా ఉందని, తక్షణం వారి న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్ల యూనియన్ అధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్ వద్ద 36 గంటల ధర్నా, వంట-వార్పు కార్యక్రమం గురువారం జరిగింది. ఆశావర్కర్లకు సంఘీభావం తెలపటానికి వచ్చిన రామకృష్ణ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో ధరలు 500 శాతం పెరిగాయని, జీతాలు మాత్రం పెరగలేదని విమర్శించారు. అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌లో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటాయని, అందుకు జగన్ వేసే అదనపు పన్నులే కారణమన్నారు. ప్రాణాలకు తెగించి కోవిడ్ కాలంలో పనిచేసిన ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు చెల్లించకుండా జగన్ ప్రభుత్వం శ్రమదోపిడీ చేస్తున్నదని మండిపడ్డారు. ప్రతి ఆశాకార్యకర్తకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని, రూ.10 లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఆన్‌లైన్ పేరుతో వేధింపులు ఆపి, పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. వారి సమస్యలు పరిష్కరించే వరకు సీపీఐ అండగా ఉంటుందని ప్రకటించారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగా ఆశా కార్మికులను పరిగణిస్తూ... సంక్షేమ పథకాల నుండి దూరం పెడుతున్నారని విమర్శించారు. గౌరవవేతనం పేరుతో పీఆర్సీ అమలుకాకుండా జగన్ ప్రభుత్వం రెండు నాల్కల ధోరణితో వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పీఆర్సీ అమలు చేయాలని, పదవీ విరమణ ప్రయోజనాలు, పెన్షన్ ఇవ్వాలని, గ్రాట్యుటీ అమలుచేయాలని, చనిపోయిన ఆశావర్కర్ల కుటుంబంలో ఒకరికీ ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, పదవీ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పీడీఎఫ్ ఎమ్మెల్సీలమంతా పోరాడతామన్నారు. ఆశా వర్కర్స్ యూనియన్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎ.కమల మాట్లాడుతూ ఆశా వర్కర్లకు నవరత్నాలు కోత పెడుతున్నారని, నాణ్యత లేని ఫోన్లు ఇచ్చి యాప్‌లు పనిచేయకపోతే తమను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తమను చర్చలకు పిలిచి సమస్య పరిష్కారానికి ముందుకు రావాలని ప్రభుత్వానికి విన్నవించారు. లేకపోతే చలో విజయవాడ నిర్వహిస్తామని, అవసరమైతే ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆశావర్కర్ల ఆందోళనకు రైతు సంఘాల రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, రైతు సంఘం నాయకులు వై.కేశవరావు, ఎన్‌జీవో పశ్చిమకృష్ణా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ సంఘీభావం తెలిపారు. ఎల్‌వీ సుధాకర్, జి.గజలక్ష్మి, ఎన్‌సీహెచ్ సుప్రజ, కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వలసలు ఆపి...ఉపాధి పనులు కల్పించాలి

విశాలాంధ్ర-శింగనమల: రాష్ట్రంలో గ్రామగ్రామాన ఉపాధి హామీ పనులు కల్పించడం ద్వారా కూలీల వలసలు ఆపాలని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బీ కేశవరెడ్డి కోరారు. వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై విజయవాడలో డిసెంబర్ 20న నిర్వహించే ధర్నాలో వ్యవసాయ కూలీలందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. 2005లో కమ్యూనిస్టు పార్టీల మద్దతుతో ఏర్పాటైన ఆనాటి యూపీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీచట్టాన్ని రూపొందించిందని... దీని ప్రకారం గ్రామీణ కూలీకి ఏడాదికి వంద రోజులు పని కల్పించాలని, కనీస వేతన చట్టాన్ని అనుసరించి కూలి రేటు చెల్లించాలన్నారు. ఉపాధి హామీల పనులు చేసుకునేవారు గుర్తింపు కార్డు తీసుకోవాలని, కార్డు ద్వారా అడిగిన 15 రోజులు లోపల పని కల్పించ లేనిపక్షంలో ప్రభుత్వం ఆ కాలానికి నిరుద్యోగ భృతి చెల్లించాలని చట్టంలో ఉందన్నారు. స్థానిక వృత్తులతో పాటు వ్యవసాయానికి అనుబంధంగా ఉపాధి హామీ పథకం గ్రామాల్లో ప్రత్యామ్నాయ మార్గంగా పనిచేస్తుందన్నారు. కాంట్రాక్టర్ లేకుండా, యంత్రాలు వాడకుండా గ్రామాల్లో నీటి సంరక్షణ, రహదారి అభివృద్ధి లాంటి పనులు కేవలం శ్రమ శక్తితో జరగాలన్నారు. వలసలు, కరువు నివారణకు ఉపాధి హామీ పనులు తక్షణం ప్రతి గ్రామంలో ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టానికి కేంద్ర బడ్జెట్లో రూ.2.40 లక్షల కోట్లు కేటాయించాలని, ఉపాధి హామీ కూలీలకు జాబ్ కార్డులో ప్రతికూలీకి 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజు వేతనం రూ600 రూపాయలు చెల్లించాలని కేశవరెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 20వ తేదీన విజయవాడ నగరంలోని ధర్నా చౌక్ వద్ద జరుగు మహాధర్నాలో అనంతపురం జిల్లా నుంచి వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు ఎస్ నాగరాజు సహాయ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'రిలయన్స్' హమాలీల కూలి పెంచాలి

వెంకటసుబ్బయ్య డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: రిలయన్స్ వ్యాపార సంస్థలు హమాలీ కూలిరేట్లు పెంచకపోవటం అన్యాయమని హమాలీ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య విమర్శించారు. సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ హమాలీల రాష్ట్రస్థాయి సమావేశం గొల్లపూడిలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో జట్ల సంఘం అధ్యక్షుడు కె.రాంబాబు అధ్యక్షతన జరిగింది. వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ రిలయన్స్ వ్యాపార సంస్థలైన రిద్ధి, టెక్నో సొల్యూషన్, ఆర్కే సీట్స్ మొదలగు కంపెనీలు కూలికి సంబంధించిన ఒప్పందాలు పూర్తై రెండు నెలలు గడుస్తున్నా కూలి పెంచకుండా మీనమేషాలు లెక్కించడం తగదని, తక్షణం కూలి రేట్లు 50 శాతానికి తక్కువ లేకుండా పెంచాలని డిమాండ్ చేశారు. సమాజంలో అన్ని రకాల వస్తువుల నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగి కార్మికుడి జీవన ప్రమాణం పూర్తిగా పడిపోయిందని, ఈ దశలో కార్మికులకు రెండు రూపాయలు పెంచకపోతే ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. వ్యాపారంగంలో దిగ్గజ సంస్థ రిలయన్స్ కోట్ల రూపాయలు లాభాలు గడిస్తూ కార్మికుల శ్రమశక్తిని దోచుకోవడం సరికాదన్నారు. రిలయన్స్ కంపెనీ అధికారులు ఆలోచించి కార్మికుడి శ్రమకు తగ్గ ఫలితం ఇవ్వాలని కోరారు. కార్మికులకు కూలి పెంచకుండా తీసివేస్తామని, కంపెనీ మూసివేస్తామని బెదిరించడం సహేతుకం కాదన్నారు. వ్యాపార రంగం ఎగుడు దిగుడుగా ఉంటుందని, ఇప్పుడు తగ్గితే రేపు పెరుగుతుందని, ఇది జగమెరిగిన సత్యమని ఆయన వివరించారు. కార్మికులకు కచ్చితంగా ఒప్పందం ప్రకారం కూలి రేట్లు పెంచాలని, ఎప్పుడు పెంచినా బకాయిలతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా కంపెనీ మొండి వైఖరి అవలంబిస్తే కార్మికులు పని నిలిపివేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించి రిలయన్స్ వ్యాపార సంస్థలలో పనిచేసే కూలీల రేట్లు కనీస వేతనాలకు అనుగుణంగా పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు కేంద్ర కార్మిక శాఖ అధికారులు, రాష్ట్ర కార్మికశాఖ అధికారులు ముందుకు రావాలన్నారు. సమావేశంలో ఫెడరేషన్ నాయకులు సత్తిబాబు, బసవయ్య, గోపి, రాజు, వెంకటేశ్, శ్రీనివాసు, వెంకటేశ్వరరావు, కొండలరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి: అక్కినేని వనజ

విశాలాంధ్ర-ఏలూరు: అంగన్వాడీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక్కడి కలెక్టరేట్ కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో జరుగుతున్న సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా అక్కినేని వనజ మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లకు, హెల్పర్లకు శ్రమకు తగ్గ వేతనం లభించడం లేదని విమర్శించారు. అంగన్వాడీల శ్రమను ప్రభుత్వం దోచుకుంటుందని ఆరోపించారు. అదనపు పనిభారంతో అంగన్వాడీ సిబ్బందిని వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. ముఖ్య మంత్రి జగన్ రూ.11 లక్షల కోట్ల అప్పులు చేశారని, ఎవరికి మేలు చేయడానికి ఖర్చు చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆడపడుచులకు అండగా ఉంటామని ప్రభుత్వం ఆర్భాటపు ప్రకటనలు చేస్తోందని, అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం ఏమి చేస్తోందని ప్రశ్నించారు. ఎఫ్ఆర్ఎస్ రద్దుచేసి అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలపై రాజకీయ జోక్యం నివారించాలన్నారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కారమయ్యేవరకు సీపీఐ అండగా ఉంటుందని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు అంగన్వాడీల పట్ల ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నాయని విమర్శించారు. సమస్యల కోసం పోరాటాలు చేస్తున్నా... ప్రభుత్వం మాత్రం దున్నపోతు మీద వాన పడిన చందంగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. జీతాలు తక్కువ ఇవ్వడం కోసం మినీ సెంటర్లు ఏర్పాటు చేశారని ఆరోపించారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ తర్వాత రూ.5 లక్షల గ్రాట్యుటీ చెల్లించాలన్నారు. అంగన్వాడీ హెల్పర్ల పదోన్నతికి వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అపరిష్కృతంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాల అద్దెలు, 2017 సంవత్సరం నుంచి ఇవ్వవలసిన టీఏ బిల్లులు, ఇతర బకాయిలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అంగన్వాడీల సమ్మెను నిర్వీర్యం చేయడానికి అధికార యంత్రాంగం కుట్ర చేస్తోందని ఆరోపించారు. అంగన్వాడీలకు వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని, సంక్షేమ పథకాలు వర్తింప చేయాలన్నారు. అంగన్వాడీల న్యాయబద్ధమైన డిమాండ్లను ప్రభుత్వం సత్వరం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధా కార్యదర్శులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, కంకిపాటి బుచ్చిబాబు, ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వర రావు, ఉపప్రధాన కార్యదర్శి తోర్లపాటి బాబు, కోశాధికారి పుప్పాల కన్నబాబు, సీపీఐ జంగారెడ్డి గూడెం, కామవరపుకోట మండల కార్యదర్శులు జేవీ రమణ రాజు, టీవీఎస్ రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గొలిమే బాలయేసు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని, సహాయ కార్యదర్శి గొర్లి స్వాతి, జిల్లా నాయకురాలు కొండేటి బేబి, సభ్యులు కొల్లూరి సుధారాణి, ఉప్పులూరి లక్ష్మి, భవానీ పాల్గొన్నారు.

దక్షిణమధ్య రైల్వేకు ఏడు జాతీయ అవార్డులు

విజయవాడ వ్యాగన్ డిపోకు ప్రథమ బహుమతి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): ఇంధన సం రక్షణ, అందుబాటులో ఉన్న శక్తిని సమర్థవంతంగా వినియోగించుకోవడంలో మంచి ప్రావీణ్యత సాధించినందుకు గాను దక్షిణ మధ్య రైల్వే ఏడు జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డులు దక్కించుకుంది. రైల్వే వర్క్‌షాప్ విభాగంలో విజయవాడలోని వ్యాగన్ డిపో ప్రథమ బహుమతి పొందింది. న్యూఢిల్లీలో జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డులు, నేషనల్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఇన్నోవేషన్ అవార్డులు, నేషనల్ పెయింటింగ్ కాంపిటీషన్ బహుమతులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్ అందుకున్నారు. దక్షిణ మధ్య రైల్వే ఈ ఏడాది ఏడు జాతీయ ఇంధన సంరక్షణ అవార్డులు సొంతం చేసుకుంది. ప్రభుత్వ కార్యాలయాల వర్గంలో హైదరాబాద్ ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ (పీఆర్ఎస్) భవనం ప్రథమ బహుమతి పొందింది. రైల్వే వర్క్‌షాప్ విభాగంలో విజయవాడలోని వ్యాగన్ డిపో ప్రథమ బహుమతి దక్కించుకుంది. జోనల్ రైల్వేల విభాగంలో దక్షిణ మధ్య రైల్వే జోన్‌కు ద్వితీయ బహుమతి లభించింది. ప్రభుత్వ కార్యాలయాల విభాగంలో లేఖ భవన్ (దక్షిణ మధ్య రైల్వే అకౌంట్స్ ఆఫీస్ భవనం) రెండవ బహుమతి పొందింది. రేణిగుంట రన్నింగ్ రూమ్ మెరిట్ సర్టిఫికెట్ పొందింది. గుంతకల్లు రన్నింగ్ రూమ్ ప్రభుత్వ కార్యాలయాల విభాగంలో మెరిట్ సర్టిఫికెట్ దక్కించుకుంది. ప్రభుత్వ కార్యాలయాల విభాగంలో గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం మెరిట్ సర్టిఫికెట్ పొందింది. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఇంధన సంరక్షణకు సంబంధించి అందుబాటులో ఉన్న శక్తిని సమర్థవంతంగా వినియోగించుకోవ డంలో ఆదర్శప్రాయమైన పనితీరును కనబరిచిన వివిధ పారిశ్రామిక యూనిట్లు, స్థాపనలు, సంస్థలు చేస్తున్న కృషిని గుర్తించేందుకు ప్రతి సంవత్సరం జాతీయ ఇంధన సంరక్షణ అవార్డులు ఇస్తారని చెప్పారు. ఇంధన సంరక్షణలో అగ్రగామిగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే కొన్నేళ్లుగా కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ నుండి ఈ అవార్డులు వరుసగా గెలుచుకుంటుందన్నారు. జాతీయస్థాయిలో ప్రతిష్ఠాత్మక అవార్డులు గెలుచుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. జాతీయ ఇంధన సంరక్షణ అవార్డుల విజేతలను అభినందిస్తూ ఈ గెలుపు జోన్‌లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి నిబద్ధతను ప్రతిబింబిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ పీడీ మిశ్రాతో పాటు సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేశ్ కుమార్ జైన్. ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ఇవ్వాలి

మంత్రి బొత్సకు ఏపీ నిరుద్యోగ జేఏసీ వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం జగన్ హామీ మేరకు మెగా డీఎస్సీ హామీ ఇవ్వాలని, ఆ దిశగా శుక్రవారం జరుగనున్న మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం విజయవాడలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయ హేమంత్ కుమార్ కలసి వినతిపత్రం అందజేశారు. 'మిమ్మల్ని నమ్మి ఓటేశాం. అన్యాయం చేయొద్దు' అని అన్నారు. కానిస్టేబుల్ రాత పరీక్షల్లో లోపం ఉన్న ప్రశ్నలను గుర్తించి, సమయం సరిపోక అర్హత కోల్పోయిన అభ్యర్థులను తదుపరి పరీక్షలకు అనుమతించేందుకు గ్రేస్ మార్కులు వేయాలన్నారు. మిగిలిన అన్ని నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు. విశ్వవిద్యాలయాల్లో 3,320 అసిస్టెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారని, గ్రూప్-1, గ్రూపు-2... వెయ్యి ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. ప్రభుత్వ హామీ ప్రకారం మరో లక్ష ఉద్యోగాలు భర్తీ చేయాలని, జనరల్ అభ్యర్థుల వయోపరిమితిని 47 ఏళ్లు పెంచాలని డిమాండ్ చేశారు.

వైసీపీ సిట్టింగుల్లో గుబులు

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో తెరపైకి 8 కొత్త ముఖాలు
- కొన్ని చోట్ల వారసులకు అవకాశం
- అధిష్ఠానం మెప్పుకోసం ఆశావహుల యత్నం

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: రానున్న ఎన్నికల్లో అధికార వైసీపీకి చెందిన 50 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేల సీట్లు గల్లంతవుతున్నట్లు జరుగుతున్న ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 8మంది కొత్తముఖాలను అసెంబ్లీ బరిలో నిలిపేందుకు వైసీపీ ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. సిట్టింగ్‌ల స్థానంలో కొత్తవారికి లేదా వారి వారసులకు సీట్లు ఇచ్చేందుకు వైసీపీ అధిష్ఠానం మొగ్గు చూపుతున్నట్లు జిల్లాలో పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ముఖ్యంగా కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, పాణ్యం, శ్రీశైలం, ఆలూరు, నందికొట్కూరు, ఆళ్లగడ్డలో సిట్టింగులను తప్పించి... కొత్తవారిని లేదా వారి వారసులను రంగంలో దింపాలని అదిష్టానం రంగం సిద్ధం చేసింది. ఆలూరు సిట్టింగ్ ఎమ్మెల్యే, కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాంను ఈ సారి కర్నూలుఎంపీ సీటుకు పోటీ చేయించాలని అదిష్టానం భావిస్తుండగా... ఆయన మాత్రం ఎమ్మెల్యే వైపు మొగ్గుచూపుతున్నారు. పార్టీ నిర్ణయం ప్రకారం తాను ఎంపీ బరిలో నిలవాలంటే ఆలూరు సీటు తన కుమారుడు ఈశ్వర్‌కు లేద తన సోదరులకు ఇవ్వాలని ఆయన పార్టీ అధిష్ఠానానికి స్పష్టం చేసినట్లు సమాచారం. ఇప్పటికే ఆ స్థానం నుంచి పోటీ చేసేందుకు కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మధుసూదన్‌రెడ్డి, చిప్పగిరి జెడ్పీటీసీ విరూపాక్షి, మాజీ ఎమ్మెల్యే నీరజారెడ్డి కుమార్తె హిమవర్షారెడ్డి ఉవ్విళ్లూరుతున్నారు. ఎమ్మిగనూరు సిట్టింగ్ ఎమ్మెల్యే ఎర్రకోట కేశవరెడ్డి... వయోభారం రీత్యా 2024 ఎన్నికల్లో పోటీ చేయనని... తన కుమారుడనికి సీటు ఇవ్వాలని కోరుతున్నారు. అయితే ఈ సీటు కోసం మాజీ ఎంపీ బుట్టారేణుక, రుద్రాగౌడ్, కుడా చైర్మెన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, రాంపురం సోదరులు కూడా పోటీపడుతున్నారు. ఇక అధిష్ఠానం ఎవరి వైపు మొగ్గుచూపుతుందో అర్థం కాని పరిస్థితి. కేశవ రెడ్డి మాత్రం తన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డికి సీటు ఇవ్వాలని పట్టుపడుతున్నట్లు తెలుస్తోంది. ఇక కోడుమూరు (ఎస్సీ రిజర్వుడు)లో సిట్టింగ్ ఎమ్మెల్యే సుధాకర్‌బాబుకు ఈసారి పార్టీ టికెట్ రావడం కష్టమేనని పుకార్లు వస్తున్నాయి. ఈ నియోజకవర్గంలో సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే సుధాకర్‌బాబు రెండు వర్గాలుగా విడిపోయి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ఇరు వర్గాల మధ్య ఉప్పు, నిప్పుగా ఉంది. సమన్వయ కర్త ఆశీస్సులు లేనిదే అక్కడ పోటీ చేసిన వ్యక్తి గెలవడం కష్టం. హర్షవర్ధనరెడ్డికి బదులుగా కొత్తవ్యక్తిని రంగంలోకి దించవచ్చనే ప్రచారం ఉంది. ఈ సీటును రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ సోదరుడు ఆదిమూలపు సతీశ్ ఆశిస్తున్నారు. కర్నూలు నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్‌కు ఈ సారి సీటు వస్తుందనే నమ్మకం లేదు. ఇక్కడి నుంచి పోటీ చేయడంపై పలువురు పార్టీ నాయకులు దృష్టి సారించారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి ఎస్వీ విజయ మనోహరి, అహ్మద్ అలీఖాన్ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ అధిష్ఠానం మైనారిటీ సీటు మైనారిటీకే ఇవ్వాలనుకుంటే అహ్మద్‌ఖాన్‌కు ఇచ్చే అవకాశం ఉంది. లేదా ఎస్వీ విజయమనోహరికి టికెట్ రావచ్చని చెప్పుకుంటున్నారు. పాణ్యంలో సిట్టింగ్ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్థానంలో వారసులను రంగంలోకి దింపాలని అధిష్ఠానం చెప్పినట్లు సమాచారం. అదే జరిగితే ఈ సారి రాంభూపాల్ రెడ్డి కుమారుడు కాటసాని శివనరసింహారెడ్డికి ఈ సీటు దక్కవచ్చు. లేదా ఇక్కడి నుంచి పోటీ చేయాలని యత్నిస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అవకాశం దక్కుతుందేమో చూడాలి. శ్రీశైలం నియోజక వర్గంలో ఇప్పటికే సిట్టింగ్ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తన కుమారుడు కార్తిక్‌రెడ్డిని రంగంలో దింపారు. ఈసారి శిల్పా వారసునిగా కార్తీక్‌రెడ్డిని వైసీపీ అభ్యర్థిగా పోటీలో నిలిపే అవకాశం ఉంది. ఆళ్లగడ్డలో ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డికి టికెట్ కేటాయించే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. కాగా నందికొట్కూరు సిట్టింగ్ ఎమ్మెల్యే ఆర్థర్‌కు సమన్వయకర్త బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఇరు వర్గాలు పోటాపోటీగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం, సిట్టింగ్‌కు సమాచారం లేకుండానే అభివృద్ధి పనులు, మార్కెట్‌యార్డు చైర్మెన్ పోస్టులు ఇవ్వడంతో ఎమ్మెల్యే వర్గం అసంతృప్తిగా ఉంది. ఇక్కడ సిట్టింగ్‌ను మార్చాలని బైరెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారని ప్రచారం ఉంది. ఆర్థర్‌కు వైఎస్ కుటుంబంతో సాన్నిహిత్యం ఉన్నందున ఆయనే మరలా పోటీలో ఉంటారనే ప్రచారం కూడా ఉంది. ఏది ఏమైనా ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ సారి ఎవరు పోటీలో ఉండబోతున్నారన్న విషయంలో ఇప్పటికీ స్పష్టత లేకపోవడంతో నాయకులు అదిష్టానం ఎప్పుడు ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటుందోననే అయోమయంలో ఉన్నారు. ఇక సిట్టింగ్‌లు ఒకపక్క ఆశావహులను బుజ్జగించుకుంటూ... మరో పక్క అదిష్టానం పెద్దలను ముఖ్యంగా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆ తర్వాత సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డిని ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం అంగన్ వాడీలు చేస్తున్న సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతును తెలుపుతోందన్నారు. ప్రభుత్వ విచ్ఛిన్న ఎత్తుగడలను ఎదుర్కొని కార్మికులు, ఉద్యోగులు ఐక్యంగా నిలబడాలని, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు, ప్రజాతంత్ర వాదులు అంగన్‌వాడీలకు సంఘీభావం ప్రకటించాలని కోరారు. 2019 ఎన్నికల్లో అంగన్‌వాడీలకు తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు అదనంగా ఇస్తానని వాగ్దానం చేసి, సీఎంగా అయ్యాక జగన్ మాట తప్పారని విమర్శించారు. అంగన్‌వాడీ కార్మికుల సమస్యల పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవచూపి సమ్మెను విరమింపజేయాలని కోరారు.

వైసీపీ, టీడీపీది వ్యక్తిగత స్వార్థం: రుద్రరాజు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ, టీడీపీది వ్యక్తిగత స్వార్థమని కాంగ్రెస్ ఏపీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ వస్తేనే రాష్ట్రానికి న్యాయం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్వర్యంలో రెండు రోజులుగా విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో జరుగుతున్న సమావేశాలకు సంబంధించిన అంశాలను ఆయన వివరించారు. పార్టీని వ్యవస్థాగతంగా బలోపేతం చేయడంపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించినట్లు చెప్పారు. సమావేశంలో సీడబ్ల్యూసీ సభ్యులు, కేంద్ర మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, కార్యవర్గ సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజల దృష్టి కాంగ్రెస్ వైపు ఉందని, ఈనెల 21న ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఉన్నత స్థాయి సమావేశం జరుగుతుందని రుద్రరాజు తెలిపారు. వైసీపీ ఇన్‌చార్జిల మార్పుపై స్పందిస్తూ ఒక చోట చెల్లని కాణీ, మరో చోట ఎలా చెల్లుతుందని ఎద్దేవా చేశారు. కాగా, ఏఐసీసీ కార్యదర్శులు సీడీ మెయప్పన్, క్రిస్టోఫర్ తిలక్, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, రాష్ట్ర జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షులతో క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి చర్యలపై సలహాలు, సూచనలను రుద్రరాజు సేకరించారు.

అంగన్‌వాడీల ఉద్యమానికి ఏపీటీఎఫ్ మద్దతు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం అంగన్ వాడీ ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ మేరకు ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీలకు పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా గ్రాట్యుటీ ఇవ్వాలన్నారు. మినిమం టైమ్ స్కేల్, 40 సంవత్సరాలపాటు ఉద్యోగం చేసినా ఉద్యోగ భద్రత లేదని... అంగన్ వాడీల పోరాటం న్యాయమైనదని వెంటనే వారి డిమాండ్లను నెరవేర్చాలన్నారు. పాఠశాలలకు అనుబంధంగా ఉన్న అంగన్ వాడీలకు భోజన ఏర్పాట్లు చేయాలంటూ జిల్లా కలెక్టర్లు ఆదేశించడాన్ని ఖండించారు.

'వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా' జయప్రదం చేయండి

విశాలాంధ్ర-విజయవాడ: ఉపాధి, ఉద్యోగాల కల్పనలో కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని.. దేశ వ్యాప్తంగా నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 23న ఢిల్లీలో నిర్వహించ తలపెట్టిన 'వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా' జాతీయ సదస్సును జయప్రదం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు కోరారు. ఏఐవైఎఫ్ జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం గురువారం స్థానిక దాసరి భవన్‌లో జిల్లా అధ్యక్షులు లంకా గోవింద రాజులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాజేంద్రబాబు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన జగన్‌మోహన్ రెడ్డి... ఆచరణలో చేసిందేమీ లేదని విమర్శించారు. 26 జిల్లాల్లో ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు కాకపోవడం, ప్రభుత్వ శాఖల్లో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇవ్వకపోవడం వల్ల రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉపాధి, ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళుతున్నారని తెలిపారు. ఉద్యోగాలు భర్తీ చేయకపోతే నిరుద్యోగులకు నెలకు రూ.10 వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ శాఖల్లో ఖాళీ ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని, ఉపాధ్యాయ, ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. దేశవ్యాప్తంగా నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేయాలని, నేటి నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించి, భాగస్వామ్యం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న ఢిల్లీలో నిర్వహించే జాతీయ స్థాయి సదస్సులో ఆంధ్రప్రదేశ్ నుండి పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుటూరి అరుణ్ కుమార్, ఏఐవైఎఫ్ ముఖ్యకార్యకర్తలు మన్నే హనుమంతరావు, షేక్ సుబాని, మాలపాటి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

పార్లమెంటు మీద దాడికి దారితీసిన దాష్టీకం

గత 22 ఏళ్ల కాలంలో పార్లమెంటు మీద దాడి జరగడం ఇది రెండవ సారి. 2001 డిసెంబర్ 13న పార్లమెంటు మీద దాడి చేసింది తీవ్రవాదులు. అప్పుడు భద్రతా దళాలకు చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. దాడికి పాల్పడ్డ తీవ్రవాదులను అక్కడికక్కడే భద్రతా దళాలు కాల్చి వేశాయి. బుధవారం పార్లమెంటు మీద దాడి చేసిన వారు తీవ్రవాదులు కాదు. మహా అయితే నిరసనకారులు కావొచ్చు. బుధవారం నాడు ఇద్దరు పార్లమెంటు భవనం సందర్శకుల గ్యాలరీ నుంచి సభలోకి దూకి పసుపు రంగు గ్యాస్‌ను వెదజల్లారు. ఆ గ్యాస్ సంచులను వారు పాదరక్షల్లో దాచుకుని వచ్చి ఉంటారు. అవి సీసాలో, డబ్బాలో కావని స్పష్టంగా తేలిపోతోంది. ఎందుకంటే వాటిని పాదరక్షల్లో దాచడం సాధ్యం కాదు. 2001 నాటి దాడికి బుధవారం జరిగిన దుశ్చర్యకు పోలిక ఏమిటంటే అదే డిసెంబర్ 13న జరగడం. ఈ రెండు ఘటనలు జరిగినప్పుడూ బీజేపీయే కేంద్రంలో అధికారంలో ఉండడం మరో పోలిక. 2001 నాటి దాడిలో తీవ్రవాదులు భారత రాజకీయ నాయకత్వాన్ని అంతటినీ ఒక్క పెట్టున అంతమొందించాలని కుట్రపన్నారని అప్పటి హోం మంత్రి అద్వాణీ అన్నారు. ఇప్పుడు కేంద్ర హోం మంత్రిగా ఉన్న అమిత్ షా బుధవారం జరిగిన దాడి మీద గురువారం సాయంత్రం దాకా నోరే విప్పలేదు. కేంద్ర హోం మంత్రి పార్లమెంటు ఉభయ సభల్లోనూ ఈ దాడిపై ప్రకటన చేయాలని కోరినందుకు లోకసభలో 14 మంది ప్రతిపక్ష సభ్యులను శీతాకాల సమావేశాలు ముగిసే దాకా సస్పెండ్ చేశారు. పార్లమెంటు మీద జరిగిన దాడి లోకసభ స్పీకర్ పరిధిలోకి మాత్రమే వస్తుందని స్పీకర్ ఓం బిర్లా చెప్పడం మరో వైపరీత్యం. మరి దీనికి ఆయన ఏ రకంగా బాధ్యత తీసుకుంటారో తెలియదు. బుధవారం నాటి దాడిలో కొట్టొచ్చినట్టు కనిపించేది ఇద్దరు వ్యక్తులు సందర్శకుల గ్యాలరీ మీంచి దూకి సభలో ప్రవేశించి బల్లలమీంచి లంఘిస్తూ ఉంటే కొన్ని నిముషాల దాకా భద్రతా సిబ్బంది జాడే కనిపించలేదు. పార్లమెంటు సభ్యులే వారిని పట్టుకుని భద్రతా దళాలకు అప్పగించారు. బుధవారం దాడిలో మొత్తం ఆరుగురి పాత్ర ఉందని పోలీసులు అంటున్నారు. అందులో అయిదుగురిని అరెస్టు చేసి ప్రశ్నిస్తున్నారు. ఈ దాడి వెనక ఉద్దేశం ఏమిటో పోలీసులు ఇంకా కనిపెట్టలేదు. కానీ పోలీసులు నిందితులను ప్రశ్నించినప్పుడు దేశంలో ఉన్న అల్లకల్లోల పరిస్థితికి, తీవ్రమైన నిరుద్యోగానికి, ప్రస్తుత ప్రభుత్వ నడవడికకు నిరసనగానే ఈ దాడి చేశామని చెప్పారంటున్నారు. ఈ ఆరుగురికి సామాజిక మాధ్యమాల ద్వారా తప్ప ఇతరత్రా పరిచయం లేదు. ఈ ఆరుగురు భిన్న రాష్ట్రాలకు చెందిన వారు. ఇంకా పోలీసులకు పట్టుబడని లలిత్ ఝా బీహార్‌కు, మనోరంజన్, సాగర్ శర్మ మైసూరుకు, నీలం ఆజాద్ హరియాణాలోని హిస్సార్‌కు, విశాల్ శర్మ గుర్గావ్‌కు, అమోల్ షిండే మహారాష్ట్రలోని లాతూరుకు చెందిన వారు. అయితే వీరంతా గుర్గావ్‌లోని విశాల్ శర్మ స్థావరంలో సమావేశమయ్యారని అంటున్నారు. వీరందరినీ కలిపింది సామాజిక మాధ్యమంలోని భగత్ సింగ్ అభిమానుల పేజీ మాత్రమే. మనోరంజన్, సాగర్ శర్మతో తమకు అసలే పరిచయం లేదని నీలం, అమోల్ షిండే అంటున్నారు. వీరిలో మనోరంజన్ ఇంజినీరు. నిరుద్యోగి. నీలం ఆజాద్ ఎం.ఫిల్ పూర్తి చేశారు. ఆమె కూడా 37 ఏళ్లు వచ్చినా నిరుద్యోగే. ఇందులో ఇ-ఆటో నడిపే వ్యక్తి ఉన్నాడు. బహుశా అస్తవ్యస్త పాలన, నిరుద్యోగ సమస్య లాంటివే వీరిని కలిపి ఉండొచ్చు. నీలం ఆజాద్ ఇది వరకు రైతుల ఉద్యమంలో, షాహీన్ బాగ్ ఉద్యమంలో పాల్గొన్నారు. మణిపూర్ మారణకాండను నిరసించారు. అందరిలోనూ సామాన్యంగా కనిపిస్తున్నది నిరాశ, నిస్పృహ, నిరసన మాత్రమే. అందుకే పార్లమెంటు మీద దాడి చేయాలని నిర్ణయించుకుని ఉంటారు. తద్వారా తమ సమస్యలను, నిజానికి దేశ వాసుల సమస్యలను సమాజం దృష్టికి తీరుకురావాలని భావించి ఉంటారు.

వారి నైరాశ్యం, అసంతృప్తి ఎంత తీవ్రమైనవి అయినా పార్లమెంటులోకి చొరబడి పొగ బాంబులు వదలడం మాత్రం సహించవలసిన విషయం కాదు. ఇది కచ్చితంగా పార్లమెంటులోకి చొరబడడమే. ఇక్కడే మరో మెలిక ఉంది. ఇందులో ఇద్దరికి పార్లమెంటు సందర్శకుల గ్యాలరీలోకి ప్రవేశించడానికి పాసులు ఇచ్చింది మైసూరు నుంచి ఎన్నికైన బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహా. వీరి ఆనుపానులు ఏమిటో తెలుసుకోవడానికి ఆయన శ్రద్ధ తీసుకున్నట్టు లేదు. పాసులు ఉన్న ఇద్దరు మాత్రమే పార్లమెంటు భవనంలోకి ప్రవేశించగలిగారు. మిగతా వారు ఆవరణలో ఉండి నినాదాలు చేశారు. వీరు "భారత్ మాతాకి జై, ఇంఖ్విలాబ్ జిందాబాద్, జై భీం, తానాషాహీ నహీ చలేగి" అని నినాదాలు ఇచ్చారు. ఇవి అందరు నిరసనకారుల నుంచి వినిపించే నినాదాలే. ప్రశ్నిస్తున్నప్పుడు వీరందరిని ఎంత గుచ్చి గుచ్చి అడిగినా ఒకే రకమైన సమాధానాలు వస్తున్నాయని పోలీసులు అంటున్నారు. ఈ విషయంలో వారు నిర్దిష్టమైన ఎత్తుగడ అనుసరించి ఉంటారు. ఈ ఆరుగురి బృందం చేసిన పని ఎంత మాత్రం క్షమార్హం కాని మాట నిజమే అయితే వారి మీద ఏకంగా చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యు.ఎ.పి.ఎ.) కింద కేసు మోపడం వీరిని తీవ్రవాదుల కింద లెక్క కట్టడమే. బెయిలు అయినా రాకుండా, విచారణ జరపకుండా దీర్ఘ కాలం జైలులో మగ్గేట్టు చూసే వ్యూహంలో భాగమే. వీరిని నడిపించే సిద్ధాంతం ఏమిటో కనిపెట్టడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అంటే వీరిని ఏదో ఒక గాటన కట్టాలన్న ఆలోచన ఉంది. నీలం ఆజాద్ మాత్రం తమకు ఏ రాజకీయ పక్షంతోనూ, సంస్థతోనూ సంబంధం లేదని చెప్తున్నారు. అంటే వీరు కోపోద్రిక్తులైన యువత మాత్రమే. కానీ వీరిని "జాతి వ్యతిరేకులు"గా ముద్ర వేయాలని పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అంత మాత్రం చేత పార్లమెంటులో చొరబాటును నివారించడంలో పోలీసుల ఘోర వైఫల్యం గాలికి కొట్టుకు పోదు. అలా కొట్టుకుపోగూడదు కూడా. ఈ దాడి వెనక ఏదో పెద్ద కుట్ర ఉందని నిరూపించడానికే పోలీసులు ప్రయత్నిస్తున్నారు. తమ భద్రతా లోపాన్ని మాత్రం పోలీసులు అంగీకరించరు. కంటి తుడుపుగా ఎనిమిది మంది భద్రతా సిబ్బందిని సస్పెండ్ చేసి ఓ పనైపోయిందనిపించారు. తాము చేసింది మహత్కార్యమని నిందితులు చెప్పుకోవడం లేదు. ఈ ప్రభుత్వం కొనసాగిస్తున్న అఘాయిత్యాలు, హక్కుల అణచివేత తమను కలవరపెడ్తున్నాయని, ఆందోళన చేస్తే జైల్లో కుక్కుతున్నారని అందువల్ల తమ అసంతృప్తిని బలంగా వ్యక్తం చేయడానికి ఇంతకు మించిన మార్గం కనిపించలేదని అందుకే ఈ పని చేశామంటున్నారు. వారు చేసిన నేరానికి ఆ మోతాదులోనే శిక్షించాలి. సర్వరోగ నివారిణిగా యు.ఎ.పి.ఎ. ప్రయోగించడం మోదీ ప్రభుత్వ దాష్టీకానికి నిదర్శనం.

యువతకు తగ్గుతున్న ఉద్యోగావకాశాలు

-కృష్ణ ఝా

దేశంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న వినాశకర విధానాల కారణంగా వ్యవసాయం, ఉత్పత్తి రంగాలలో ఉద్యోగావకాశాలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. అలాగే నిర్మాణరంగంలో కార్మికులకు పనుల లభ్యత బాగా నెమ్మదించింది. 2004-05 తరువాత నిర్మాణరంగం బాగా పుంజుకున్నది. అయితే 2016 నుంచి ఉద్యోగావకాశాలు దాదాపు ఆగిపోయాయి. అంతేకాదు, చదువుకున్న యువతకు, ఉద్యోగాలలో నియమితులయ్యే వారి నిష్పత్తి బాగా తగ్గిపోయి యువత నిరాశకు లోనవుతోంది. ప్రత్యేకించి, సేవారంగంలో కొత్త ఉద్యోగ అవకాశాలు లేవు. కృత్రిమమేధ, సత్సంబంధిత రంగంలోనూ ఉద్యోగాలు నెమ్మదిగా పెరుగుతున్నాయి. సమయమూ, నైపుణ్యంగల చదువులు చదువుకునేందుకు డబ్బు ఎక్కువ ఖర్చు అవుతున్నప్పటికీ వ్యవసాయేతర రంగంలో మెరుగైన ఉద్యోగ అవకాశాలు కూడా లభించని నిరాశ దృశ్యం కనిపిస్తోంది. అసంఘటిత రంగంలో ఎలాంటి రాతపూర్వక ఒప్పందంలేని కాంట్రాక్టు ఉద్యోగాలు, సూక్ష్మ, చిన్న పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు కలుగుతున్నాయి. ఏడాదిలోపు కాంట్రాక్టు ఉండే ఉద్యోగాలు లభిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఏడాదిలోపు కాంట్రాక్టు ఉద్యోగాలే ఎక్కువ లభిస్తున్నాయి. గ్రామీణ, పట్టణప్రాంతాలలో నిజవేతనాలు లభించే ఉద్యోగాలు పెరగడంలేదు. భారత ఆర్థిక రంగంలో నిర్మాణాత్మకమైన వ్యవస్థలో మార్పు జరిగింది. 2016 నుంచి వ్యవసాయేతర రంగాలలో ఉద్యోగ అవకాశాలు గణనీయంగా పడిపోతున్నాయి. వ్యవసాయ కార్మికులకు లభించేపనులు కూడా బాగా తగ్గుతున్నాయి. తాజాగా లభించిన సమాచారం ప్రకారం, వ్యవసాయేతర, సేవారంగం ఉద్యోగావకాశాలను పెంపొందిస్తుంది. నిర్మాణరంగంలో ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయి. 2017-18నుంచి ఉత్పత్తి రంగంలోనూ ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయి.

ఉద్యోగ అవకాశాలలో డిమాండ్ నెమ్మదించడంవల్ల ఉద్యోగమార్కెట్ అసమానంగా ఉన్నది. సరైన విద్య, శిక్షణ ఉన్నప్పటికీ అత్యధిక యువతకు ఉద్యోగ అవకాశాలు అధ్వాన్నంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో యువత ఆత్మహత్యలకు పాల్పడటం విషాదం. వ్యవసాయేతర రంగం, సంఘటిత రంగాలలో ఉద్యోగాల వాటా 2018-22 మధ్యకాలంలో 34.5శాతం ఉన్న ఉద్యోగాలు 29.5శాతానికి పడిపోయాయి. ఉద్యోగాలు లభించక పోవటంతో తదనంతరం చదువుకు, శిక్షణకు వెళ్లడానికి సిద్ధంగా లేరు. ఉన్నతవిద్య గల యువత శిక్షణ ఉన్నప్పటికీ, నిరుద్యోగం వేగంగా ఎందుకు పెరుగుతున్నది? 2015-16 నుంచి 2017-18 మధ్యకాలంలో ఏనాడూ లేనంతగా ఉద్యోగావకాశాలు క్షీణించాయి. ఇప్పటికీ ఈ ధోరణి కొనసాగుతూనే ఉంది. వ్యవసాయం, ఉత్పత్తి రంగాలలో ఉద్యోగావకాశాలు తగ్గడంతోపాటు నిర్మాణ రంగంలోనూ కార్మికులకు పనులు తగ్గిపోయాయి. వ్యవసాయేతర రంగంలో ఉద్యోగాలు కొరతేర్పడింది.

అదేసమయంలో నిరుద్యోగం పెరుగుతున్నందున వ్యవస్థపైనే నమ్మకం పోతోంది. కార్మికులలో యువతకు శిక్షణ ఏమీ అవసరం ఉండదు. విద్యావంతులు, శిక్షణ పొందినవారు 2015,2016, 2018, 2020లలో 20 లక్షలమంది ఉన్నారు. వీరి సంఖ్య 2020-21నాటికి 30లక్షలకు పెరిగింది. తాము కార్మికులుగానూ, విద్యావంతులుగానూ శిక్షణ పొందినవారిగానూలేమని 100.2 మిలియన్ల యువత 2017-18లో ప్రకటించింది. వీరంతా నిరాశ, నిస్పృహలతోఉన్నారు. 2015-2018లో ఉద్యోగ అవకాశాలు పూర్తిగా తగ్గిపోయాయి. ఆ పరిస్థితి ఈనాడు కూడా ఉంది. దేశచరిత్రలో ఇలా ఉండటం మొదటిసారి. వ్యవసాయ రంగంలోనూ నిరుద్యోగం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఉత్పత్తిరంగంలోనూ ఉద్యోగాలు 49శాతం నుంచి 44శాతానికి పడిపోయింది. మేకిన్ ఇండియా అనేది నినాదానికే పరిమితమైంది. వ్యవస్థీకృత మార్పు జరగనిదే ఉద్యోగ అవకాశాలు పెరగవు.

అంగన్‌వాడీల సమ్మెకు ప్రభుత్వానిదే బాధ్యత

చలసాని వెంకటరామారావు

"నిండు చెరువులో నీళ్లు లేవు అన్నట్లు" ఉంది రాష్ట్రంలో జగన్ పాలన. 'ఉట్టికి ఎక్కలేనమ్మ స్వర్గానికి నిచ్చెన వేస్తాను' అన్నట్లు శుష్క వాగ్దానాలు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆ వాగ్దానాలు నెరవేర్చక ప్రజా ఉద్యమాలను పోలీసులతో అణచివేయాలని చూస్తున్నారు. అధికారంలోకి రాగానే అంగన్‌వాడీలకు తెలంగాణ ప్రభుత్వం కన్నా వెయ్యి రూపాయలు అదనంగా ఇస్తానని నమ్మబలికి వారి ఓట్లు కొల్లగొట్టి ఇప్పుడు అధికారం చివరికి వచ్చినా వారి వేతనాలు పెంచకుండా తాను అధికారంలోకి వచ్చిన తరువాత వేలాది రూపాయలు వేతనం పెంచానని ప్రచారం చేస్తున్నారు. గత ప్రభుత్వం తన పాలన చివరి రోజుల్లో పెంచిన వేతనం తన ఖాతాలో వేసుకుని అది వైసీపీ ఘనతగా ప్రచారం చేసుకుంటున్నారు. కార్మిక యూనియన్లు రూ.26 వేలు కనీస వేతనంగా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో వర్కర్‌కు రూ.13,650, మినీ హెల్పరుకు రూ.9,000 ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రూ11, 500, రూ 7000 ఇస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ చెప్పిన ప్రకారం రూ.14,650, రూ 10,000 ఇవ్వాలి. కానీ జగన్ ప్రభుత్వం మాటతప్పి, మడమ తిప్పింది. వేతనాలు పెంచకపోగా ప్రస్తుతం పని భారం పెరిగి అంగన్‌వాడీ కార్మికులు అల్లాడిపోతున్నారు. గతంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు పని చేసేవారు. ప్రస్తుతం ఉదయం 7గంటలకే ఇంటి నుంచే పని ప్రారంభించి సాయంత్రం 7,8 గంటల వరకు పని చేయాల్సి వస్తున్నది. యాప్‌ల పేరుతో వేధింపులకు, అధికారుల పెత్తందారీతనానికి గురై తల్లడిల్లిపోతున్నారు. అధికారులు అంగన్‌వాడీలను చులకనగా, అగౌరవంతో, దొంగలలా నిరాదరణకు గురిచేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న యాప్‌లకు తోడు ఈ సంవత్సరం ఆగస్టు నుంచి ఎఫ్‌ఆర్‌ఎస్ పేరుతో మరో కొత్త యాప్‌ను తీసుకువచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లు నాణ్యత లేనివి కావటం, గ్రామాలలో ఇంటర్‌నెట్ సౌకర్యం అంతంత మాత్రంగా ఉండటంతో అంగన్‌వాడీలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అన్ని యాప్‌లను కలిపి ఒకే యాప్‌గా రూపొందించాలని కార్మిక సంఘాలు ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నా రాష్ట్ర స్థాయి అధికారులు కొందరు ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించి కొత్త కొత్త యాప్‌లను తీసుకువస్తున్నారు. ఈ యాప్‌ల వలన అంగన్‌వాడీలతో పాటు గ్రామీణ వినియోగదార్లు కూడా చాలా ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణులు కేంద్రాలకు వచ్చినప్పుడు యాప్‌లు పనిచేయక, ఇంటర్‌నెట్ లేక చాలాసార్లు కేంద్రాల చుట్టూ తిరగవలసి వస్తున్నది. నెట్ సమస్యల వల్ల కార్యకర్తలు అర్ధరాత్రి వరకు పనిచేయక తప్పడంలేదు. ఇచ్చే మూరెడు జీతానికి బారెడు పని చేయవలసి వస్తున్నదని అంగన్‌వాడీ కార్యకర్తలు నిరాశా నిస్పృహలకు గురవుతున్నారు. ఇంతగా శ్రమపడి పనిచేసినా అధికారులు బెదిరించటం, భయపెట్టటం జరుగుతోంది. అత్యవసర పరిస్థితులలోనూ సెలవులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రభుత్వం మారినప్పుడల్లా యూనిఫాం కూడా మార్చివేస్తున్నారు. ఇటీవల రాజకీయ కక్షతో అధికార పార్టీ నేత ఒకరు ట్రాక్టరుతో అంగన్‌వాడీ కార్యకర్తను తొక్కించి చంపటం, మరో ఘటనలో అధికార పార్టీ నేత వేధింపులు తట్టుకోలేక ఒక కార్యకర్త ఆత్మహత్యా ప్రయత్నం చేయటం వాస్తవ పరిస్థితికి అద్దం పడుతున్నది. దీనికి తోడు 10వేల రూపాయలకు మించి జీతం వస్తున్నది కనుక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనర్హులని చెప్పి వాటిని రద్దుచేశారు. గత ప్రభుత్వం స్కీం వర్కర్లను దీని నుంచి మినహాయిస్తే ప్రస్తుత

ప్రభుత్వం వారిని ఇబ్బందులకు గురిచేసి సంక్షేమ పథకాలకు మంగళం పాడింది. ఈ నిబంధన వల్ల గిరిజన ప్రాంతాలలో 51వేల 299 మంది అంగన్‌వాడీ గిరిజన మహిళలు ఆర్థిక సాయం అందక సామాజిక పింఛన్లు, అమ్మఒడి సాయం, ఇళ్లపట్టాలు, నిర్మాణ రాయితీలు కోల్పోతున్నారు.

2023 ప్రపంచ ఆర్థిక సూచీలో భారతదేశం 125 దేశాల్లో 111వ స్థానంలో ఉంది. ఆకలి మరణాల సూచీలో 107వ స్థానంలో ఉంది. దరిద్రుల శాతంలో మన దేశం అగ్రస్థానం పొందింది. దేశంలో పేదరికం, పోషకాహార లోపం నివారించేందుకు రూపొందించిన మాతా, శిశు సంరక్షణ పథకం పేదలను ఆదుకుంటుందని భావిస్తే కేంద్రప్రభుత్వం ఈ పథకం పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. దేశ బడ్జెట్‌లో నామమాత్రంగా రూ.20,554.31 కోట్లు కేటాయించి చేతులు దులుపుకుంది. పెరుగుతున్న ధరవరలు, సామాజిక అవసరాలను పరిగణనలోకి తీసుకుంటే ఇది ఏమాత్రం సరిపోదు. గర్భిణులు, పసిపిల్లలు అర్ధా ఆకలితో జీవించవలసి వస్తున్నది. అసలు పథకం లక్ష్యమే నీరుగారిపోతున్నది. దీనితో పోషణ ట్రాక్ యాప్‌ను తీసుకువచ్చి లబ్ధిదారుల సంఖ్యను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. ఇక అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే సరుకుల పరిస్థితి చూస్తే నవ్వాలో, ఏడవాలో అర్థంకాని పరిస్థితి. 50కిలోల బియ్యం బస్తాలో రెండుమూడు కిలోల తరుగు ఉంటుంది. అయినా 50కిలోలు ఉన్నట్లుగా అంగన్‌వాడీలు సంతకం పెట్టి సరుకు తీసుకోవాలి. 50కిలోలకే లెక్క అప్పగించాలి. కందిపప్పు పుచ్చిపోయి నాణ్యత లేనిదిగా వస్తుంది. చిక్కీలు, కర్జూరకాయలు నాసిరకంగా ఉంటున్నాయి. కోడిగుడ్డు 35 గ్రాములకు మించి ఉండదు. గతంలో నెలకు 1250 గ్రాముల చిక్కీలు ఇస్తే ఇప్పుడు 250 గ్రాములకు పరిమితం చేశారు. బెల్లం ఒక కేజీ నుంచి 250 గ్రాములకు తగ్గించారు. స్టాకు లేదని సాకుచెప్పి ఒక్కో వస్తువు ఒకోసారి ఇస్తారు. ప్రభుత్వం ఇచ్చే ట్రాన్స్‌పోర్టు చార్జీలు చాలక అంగన్‌వాడీలు తమ చేతి చిలుం వదిలించుకోవలసి వస్తున్నది. అంగన్‌వాడీ కేంద్రాలలో కూడా వివక్షత కన్పిస్తుంది. 300 జనాభాకు తక్కువ ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు మినీ వర్కర్ అనే పేరుతో వర్కర్ పని, హెల్పర్ పని ఒకరితోనే చేయిస్తున్నారు. మినీ వర్కర్లకు జీతం తక్కువ ఇస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం లేదు. వీరికి ఎటువంటి సెలవులు లేవు. వేసవి సెలవులు 15 రోజులు కూడా ఇవ్వటంలేదు. అన్ని రోజులు పనిచేసినా జీతంలో వివక్షత కొనసాగుతూనే ఉంది. బాలింతల పోషణ, తల్లీబిడ్డల సంరక్షణ, ప్రీస్కూల్ నిర్వహణ వంటి పనులు శాశ్వత స్వభావం కలిగినవి. వీటికి శాశ్వత ఉద్యోగాలు కల్పించాలి. గౌరవ వేతనం పేరుతో కార్మికుల శ్రమను దోపిడీ చేయటం సంక్షేమ రాజ్యంలో సరైన పద్ధతి కాదు. ప్రజల ప్రయోజనం పరిరక్షణకు ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలి. బడ్జెట్‌లో నిధులు కేటాయింపు అవసరాలకు అనుగుణంగా పెంచాలి. అంగన్‌వాడీలకు శాశ్వత ఉద్యోగులను నియమించాలి. నిజమైన సామాజిక న్యాయం, ఆరోగ్య భారత్ నిర్మాణానికి పాలకులు పూనుకోవాలి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళా శిశుసంక్షేమశాఖ (ఐసీడీఎస్) పరిధిలో లక్షా 8వేల మంది అంగన్‌వాడీలు పనిచేస్తున్నారు. వీరికి పని భద్రత కల్పించాలని, పని భారం తగ్గించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు నివారించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, చట్ట ప్రకారం సెలవులు, గ్రాట్యుటీ, పెన్షన్, రిటైర్మంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కార్మిక సంఘాలు ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నాయి. 62 ఏళ్ల సర్వీసు, మినీ వ్యవస్థ రద్దు, నాణ్యమైన సరుకులు సరఫరా వంటి డిమాండ్లను యూనియన్‌లు ప్రభుత్వం ముందు ఉంచాయి. సుప్రీంకోర్టు సూచించిన మేరకు గ్రాట్యుటీ, రిటైర్మంట్ బెనిఫిట్‌గా 5 లక్షలు, వేతనంలో సగభాగం పెన్షన్ చెల్లించాలనీ కార్మిక సంఘాలు చెబుతున్నాయి. రాష్ట్రంలోని 55,607 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధి పొందుతున్న 40 లక్షల మంది మాతా,శిశు , గర్భిణుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పై డిమాండ్ల సాధనకు శాంతియుతంగా కార్మికులు ప్రభుత్వానికి అనేక సందర్భాలలో విజ్ఞప్తులు, రాయబారాలు నిర్వహించారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం వారి డిమాండ్లను పెడచెవిన పెట్టింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పిన ప్రకారం తెలంగాణ రాష్ట్రం కంటె 1000 రూపాయలన్నా అదనంగా ఇవ్వాలని కోరింది. అంగన్‌వాడీల సమస్యలపై కార్మిక సంఘాలతో చర్చిస్తామనిమార్చి 20న శాసన మండలిలో ప్రభుత్వం ప్రకటించింది, గాని చర్చల క్రమం ప్రారంభం కాలేదు. దానితో డిమాండ్ల సాధనకు ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆగస్టు 27న విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహించి కార్మికులను పోరుబాటకు సిద్ధం చేశాయి. చివరకు మూడు యూనియన్ల సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబరు 25న చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపు ఇచ్చాయి. ప్రభుత్వం స్పందించకపోగా రాష్ట్ర వ్యాపితంగా 20వేల మంది ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టయూ అంగన్‌వాడీ యూనియన్ల నాయకులను గృహ నిర్బంధాలు, అరెస్టులు, పోలీస్‌స్టేషన్లకు తరలింపు చేశారు. అయినా 3వేల మంది అంగన్‌వాడీలు విజయవాడలో ధర్నా నిర్వహించి అరెస్టు అయ్యారు. అక్టోబరు 9న ఐసీడీఎస్ డైరెక్టరు జరిపిన చర్చలు కేవలం మొక్కుబడిగా మాత్రమే జరిగాయి. గత్యంతరం లేనిస్థితిలో కార్మికులు డిసెంబరు 8 నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధమయ్యారు. 8,9 తేదీలలో కేంద్ర బృందాలు రాష్ట్రంలో అంగన్‌వాడీ ప్రాజెక్టులు సందర్శించినందున డిసెంబరు 12 నుంచి లక్ష మంది కార్మికులు కేంద్రాలను మూసి సమ్మె బాట పట్టారు. అంగన్‌వాడీ కార్మికుల సమ్మె పోరాటానికి విస్తృత మద్దతు వస్తున్నది. వీరి సమ్మెకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ జోక్యం చేసుకుని "దున్నపోతు ఈనిందంటే దూడను కట్టి వేయమన్నట్లు" కాకుండా కార్మికుల వేతనాలను పెంచి సమస్యలను పరిష్కరించాలి. సమయస్ఫూర్తిని ప్రదర్శించాలి. అంగన్‌వాడీ కార్మికులతో పెట్టుకుని గుర్రాలతో తొక్కిస్తే గతంలో ఏమి ఫలితాలు వచ్చాయో పాలకులు గ్రహిస్తే అందరికీ మంచిది.

ఏఐటీయుసి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు
సెల్: 9490952093

ఆర్థిక విధానాలపై చర్చే 'ఇండియా' కూటమి ప్రధాన ఎజెండా కావాలి



మక్కెన సుబ్బారావు

ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల కారణంగా ప్రతిపక్ష 'ఇండియా' కూటమి (ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంట్, ఇన్‌క్లూజివ్ అలయన్స్) దాదాపు మూడుమాసాలపాటు నిస్తేజంగా ఉండిపోయింది. కూటమిలో ప్రధాన భాగస్వామి అయిన కాంగ్రెస్‌పార్టీ ఆ ఎన్నికల్లో తలమునకలగా ఉండటమే కారణం. ఫలితాలు వచ్చాయి. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో సైతం అధికారం కోల్పోవడంతో కాంగ్రెస్ పునరుజ్జీవ ఆశలు అడియాసలైనాయి. తెలంగాణలో అధికారంలోకి రావటం ఊరట. ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో ఇతర 'ఇండియా కూటమి' భాగస్వామ్య పార్టీలు ఉనికిలో లేనందున కాంగ్రెస్‌ది దాదాపు ఒంటరి పోరాటమే. మధ్యప్రదేశ్‌లో మాత్రం ఐదు సీట్లలో సమాజ్‌వాదిపార్టీ ఉనికి ఉంది. ఆ మేరకు ఆ పార్టీని ఇముడ్చుకోవటంలో రాష్ట్ర కాంగ్రెస్ సంకుచిత దృష్టి అడ్డుపడింది. అంతేకాదు, ఇండియా కూటమి ప్రారంభోత్సవ సభ భోపాల్‌లో జరపాలని నిర్ణయించినా కమల్‌నాథ్ నిరాకరించాడు. కారణం! డీఎంకే ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ కుమారుడు, మంత్రి ఉదయనిధి సనాతన ధర్మానికి వ్యతిరేకంగా చేసిన ప్రకటన తమకు ఇబ్బందికరంగా మారుతుందని కమల్‌నాథ్ ఆ సభను వ్యతిరేకించాడు. దాంతో ఆ ప్రారంభం ఆగిపోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో స్థానిక సర్దుబాట్లను రాష్ట్ర నాయకత్వమే చూసుకుంటుందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే ప్రకటించడం ఆయన నిస్సహాయతను బయటపెట్టింది. పర్యవసానం 'ఇండియా' కూటమికి తప్పనిసరి నిద్రావస్థ!

హిందీ బెల్టులోని మూడు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి రావటం లోక్‌సభ ఎన్నికలకు దానికి నైతిక ప్రోత్సాహమిస్తుంది. రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్టితోనే బీజేపీ ఆ రాష్ట్రాల్లో సామాజిక సమీకరణలకు అనుగుణంగా కొత్తవారిని ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టింది. సీనియర్‌లను సముదాయించేందుకు 10రోజుల వ్యవధి తీసుకుంది. ఛత్తీస్‌గఢ్‌లో గిరిజన నేత విష్ణుదేవ్ శాయి, మధ్యప్రదేశ్‌లో ఓబీసీ నాయకుడు మోహన్‌యాదవ్, రాజస్థాన్‌లో బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన భజన్‌లాల్ శర్మను ప్రభుత్వ నేతలుగా ఎంపిక చేసింది. ఇతర ప్రధాన సామాజిక తరగతులను సంతృప్తి పరిచేందుకు ప్రతి రాష్ట్రంలో ఇద్దరేసి ఉప ముఖ్యమంత్రులను నియమించింది. వచ్చే ఎన్నికలకోసం సామాజిక సమతూకంతో నిర్ణయాలు చేసింది. ఎన్నికల వ్యూహాలు రచించటంలో మోదీ-షా సిద్ధహస్తులని మరోసారి రుజువైంది. బీజేపీ-కాంగ్రెస్ ముఖాముఖి తలపడే రాష్ట్రాల్లో మోదీ హిందూత్వ ప్లస్ సంక్షేమం రూపాన్ని కాంగ్రెస్ తట్టుకోలేకపోతున్నది.గతించిన సమయం తిరిగిరాదు. మరో ఐదునెలల్లో లోక్‌సభ ఎన్నికలున్నందున, ఆ ఎన్నికల్లో నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడే నిమిత్తం ఇండియా కూటమి ఏర్పడినందున అది తమ భవిష్యత్ కార్యాచరణపై తక్షణం దృష్టిపెట్టాలి. ఇది ప్రధానంగా కాంగ్రెస్ ప్లస్ ప్రాంతీయపార్టీల కూటమి అయినందున ఉమ్మడి కార్యాచరణ ముఖ్యం. కూటమికి కన్వీనర్ ఎన్నిక అవశ్యం. ఉమ్మడి కనీస కార్యక్రమం, ఉమ్మడి ప్రచారం, సీట్ల సర్దుబాటు అవసరం. కాంగ్రెస్‌కు నాయకత్వం ఆశలున్నా అవి ఐదు అసెంబ్లీ ఎన్నికలతో అంతరించి ఉండాలి. కూటమిలో అతి పెద్ద పార్టీగా అందరూ గౌరవిస్తారు. కాని వివాదరహితుడైన కాంగ్రెసేతర వ్యక్తి కన్వీనర్‌గా ఉండటం విశ్వాసం కలిగిస్తుంది. ప్రధాని మోదీ ఎజెండాను నిర్దేశించటం, ప్రతిపక్షాలు దానికి జవాబు చెప్పటం వంటి పద్ధతుల్లో సాగుతున్న ఎన్నికల ప్రచార ధోరణి మారాలి. ఇండియా కూటమి ఎజెండాను నిర్దేశించి ప్రధానినీ, బీజేపీని దోషిగా ప్రజల ముందు నిలబెట్టాలి. అలా చేయాలంటే ఆర్థిక విధానాలపై చర్చే ప్రధానం కావాలి. అదొక్కటే బాధలు పడుతున్న సామాన్య ప్రజల మనస్సును సులువుగా తాకుతుంది. "వాదా న తోడో అభియాన్" వేదిక కింద అకడమిక్‌లు, పౌరసమాజ సంస్థల బృందమొకటి నరేంద్ర మోదీ ప్రభుత్వ పరిపాలన తీరుపై తయారుచేసిన నివేదిక ఇందుకు ఎంతో ఉపకరిస్తుంది. అసమానత, ప్రజాస్వామ్యంపై దాడుల విషయంలో కేంద్ర ప్రభుత్వం నత్తనడక స్పందన పట్ల ఆవేదన వ్యక్తం చేసింది. ఆ నివేదిక శీర్షిక "2019-2023 వాగ్దానాలు, వాస్తవం" ఎన్‌డీఏ-2 ప్రభుత్వం 4సంవత్సరాల పైబడిన పాలనపై పౌరుల సమీక్ష (ప్రామిసెస్ అండ్ రియాలిటీ 2019-2023: సిటిజన్స్ రెవ్యూ



ఆఫ్ 4+2 ఇయర్స్ ఆఫ్ ఎన్‌డీఏ-2 గవర్నమెంట్). ఆ నివేదిక అనేక విషయాలతోపాటు దేశ ఆర్థిక స్థితిగతులపై ఇలా చెప్పింది. "భారతదేశ జీడీపీ వృద్ధి బలంగా ఉన్నప్పటికీ అది ఎంతో అసమతుల్యంగా ఉంది. జనాభాలో పై స్థాయిలోని 1శాతం మంది జాతీయ ఆదాయంలో 22శాతం అనుభవిస్తున్నారు. పై స్థాయిలోని 10శాతం మంది కలిపి 57శాతం సంపద సొంతం చేసుకుంటున్నారు. దిగువ 50శాతం మంది వాటా 13శాతానికి దిగజారింది. అసమానతను విస్తృత పరుస్తున్నది. పేద ప్రజలను మినహాయిస్తున్నది". కాబట్టి, జనవరి 22న అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం, జమ్ము-కశ్మీర్‌కు ఆర్టికల్ 370 ఇచ్చిన ప్రత్యేక ప్రతిపత్తి రద్దును సుప్రీంకోర్టు సమర్థించడం వగైరా తమ విజయాలుగా మోదీ-షా ప్రచారం చేసుకోవచ్చుగాక. ప్రతిపక్షాలను హిందూ వ్యతిరేకులుగా నిందిస్తూ హిందూ మతోద్ధారకులం తామేనని చెప్పుకోవచ్చుగాక! ఆ ప్రచార ఉచ్చులో చిక్కుకోకుండా మోదీ ప్రభుత్వ ఆర్థికరంగం వైఫల్యంపై ఇండియా కూటమి కేంద్రీకరించటం మేలు.

ఈ నెల 19న జరిగే ఇండియా కూటమి సమావేశం అత్యంత కీలకం. సాధ్యమైనంత త్వరగా ప్రజలముందుకు వెళ్లే ఎజెండాకు, సీట్ల సర్దుబాటుకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇంతకుముందే నియమించిన సమన్వయ కమిటీ పని ప్రారంభించినట్లులేదు. కనీస కార్యక్రమమంటే 'ఉచితాల' హామీలు కాదు, సామాన్య ప్రజల జీవితాలను మెరుగుపరిచే అభివృద్ధి కార్యక్రమాల హామీ, ప్రభుత్వరంగాన్ని పటిష్టంచేసే హామీ, సంఘటిత, అసంఘటిత రంగాలకు భరోసా. సీట్ల పంపిణీ సమస్య కీలకం. ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఆ బాధ్యత తమకివ్వాలని అవి కోరుతున్నాయి. ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్న పార్టీల్లో కొన్ని సంబంధిత రాష్ట్రాల్లో ప్రత్యర్థులుగా ఉన్నాయి. కాబట్టి లోక్‌సభ ఎన్నికలు లక్ష్యంగా అన్ని పార్టీలు విశాల దృష్టితో పరస్పర లాభమనే భావనతో సమిష్టి సర్దుబాట్లకు రావలసి ఉంటుంది. చివరగా, ఇటు మోదీ, అటు ఎవరు? అన్న సవాలును బీజేపీ తరచూ విసురుతుంటుంది. ప్రతిపక్షంలో అర్హులు చాలామంది ఉన్నారు. ఎన్నికల అనంతరం సమిష్టి నిర్ణయం ఉంటుంది. 2004 ఎన్నికల్లో కూటమి లేనేలేదు. ఎన్నికల అనంతర పరిస్థితుల్లో యూపీఏ ఏర్పడింది. డాక్టర్ మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఎన్నికైన ఉదాహరణ అందరికీ తెలిసిందే. నాయకుని చుట్టూ రాజకీయాన్ని తిప్పటం అప్రజాస్వామికం, నిరంకుశపోకడ. మళ్లీ మోదీ అధికారంలోకివస్తే నియంతృత్వం సంపూర్ణం అవుతుందన్న భావన ప్రజల్లో బలంగా ఉంది. అదే ఇండియా కూటమికి సొంత ఖర్చులేని పెట్టుబడి. దాన్ని నేర్పుగా ఉపయోగించుకోవడం కూటమి ఓర్పు, సమిష్టితత్వంపై ఆధారపడి ఉంటుంది.

సీనియర్ జర్నలిస్టు
ఫోన్: 9490952109

దద్దరిల్లిన పార్లమెంటు

- భద్రతా వైఫల్యంపై చర్చకు విపక్షాల డిమాండ్
- లోక్‌సభ, రాజ్యసభలో నినాదాలు - గందరగోళం
- కొనసాగిన వాయిదాల పర్వం

న్యూదిల్లీ: పార్లమెంటు సమావేశాలు గురువారం ఉదయం ప్రారంభమైన వెంటనే భద్రతా వైఫల్యంపై చర్చ కోసం విపక్ష ఎంపీలు పట్టుబట్టారు. ఈ ఘటనపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని ప్రతిపక్షాల ఎంపీలు డిమాండ్ చేశారు. వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. ఆందోళనకు దిగారు. వారిని ఆపేందుకు స్పీకర్ యత్నించినా ఫలితం లేకపోవడంతో సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి తలెత్తింది. భద్రతా వైఫల్యంపై చర్చ చేపట్టాలని విపక్షాలు పట్టుబట్టడంతో చైర్మన్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. దీంతో ఉభయ సభలు దద్దరిల్లిపోయాయి. లోక్‌సభలో స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ పార్లమెంటు కంపెక్స్ భద్రత చూసుకోవాల్సిన బాధ్యత లోక్‌సభ సెక్రటేరియట్‌పై ఉంటుందని చెప్పారు. దీనిపై ఎంపీలతో చర్చకు సిద్ధమని తెలిపారు. పార్లమెంటు భద్రతపై సమీక్ష జరపాలని హోం శాఖకు లేఖ రాస్తానన్నారు. అయితే చొరబాటుదారులలో ఒకరికి జారీ చేసిన విజిటర్ పాస్‌పై సంతకం చేసిన బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహాపై చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. ఇది ఇంటెలిజెన్స్ వైఫల్యమని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలన్నారు. ఘటనపై హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాల్సిందేనని పట్టుపట్టారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే భద్రతా వైఫల్యం జరిగిందని ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన వ్యక్తం చేశారు. భారీ భద్రతా ఉన్నప్పటికీ దుండగులు లోక్‌సభలోకి ప్రవేశించి అలజడి సృష్టించడంపై ప్రశ్నోత్తరాలప్పుడు నిరసన తెలిపారు. పెద్దపెట్టున నినాదాలు చేశారు. అటు రాజ్యసభ సాయంత్రం 4 గంటల వరకు ఐదుసార్లు వాయిదా పడింది. లోక్‌సభలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ అందరు సంయుక్తంగా ఈ ఘటనను ఖండించాలని, సభను అడ్డుకోవడం, నిరసన తెలపడం అర్థరహితమన్నారు. 'అందరం జాగ్రత్తగా ఉండాలి. అలజడి సృష్టించేవారికి పాసులు ఇవ్వరాదు' అని గందరగోళనం నడుమ మాట్లాడారు. పాత భవనంలో కాగితాలు విసరడం, దూకడం వంటివి జరిగాయని గుర్తుచేశారు. వాయిదా తర్వాత సభ సమావేశమైనప్పుడు కూడా ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన కొనసాగించారు. భద్రతా వైఫల్యంపై ప్రభుత్వం ప్రకటన చేయాలని నినాదాలు చేశారు. 15 నిమిషాలు జరిగిన ప్రశ్నోత్తరాల్లో రెండు ప్రశ్నలు, దాని అనుబంధ ప్రశ్నలపై మాట్లాడారు. కాంగ్రెస్ సభ్యులు టీఎన్ ప్రతాపన్, డీన్ కురియాకోసె, హిబీ ఎడన్ పేర్లను పిలిచి స్పీకర్ హెచ్చరించారు. సభ కార్యకలాపాలను అడ్డుకోవద్దని సూచించారు. కాంగ్రెస్ ఎంపీలను సస్పెండ్ చేయాలనే తీర్మానాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రవేశపెట్టారు. సభ వాయిదాకు ముందు ఆయన మాట్లాడుతూ పటిష్ఠ భద్రతకు రాజకీయేతర విధానం అవసరమని చెప్పారు. సస్పెండ్ చేసిన తర్వాత కూడా టీఎంసీ ఎంపీ డెరెక్ ఓ బ్రెయిన్ సభలో ఉండటం వల్ల కార్యకలాపాలకు విఘాతం కలుగుతోందని చైర్మన్ జగదీప్ ధన్కర్ వ్యాఖ్యానించారు. మధ్యాహ్నం భోజన విరామం తర్వాత రెండు వాయిదాల అనంతరం 3 గంటలకు పెద్దల సభ తిరిగి సమావేశమైంది. ధన్కర్ మాట్లాడుతూ 'తన ప్రవర్తనపై ఆత్మపరిశీలన చేసుకునేందుకు, మరోమారు సభాపతి ఆదేశాలను అతిక్రమించరని ఆశిస్తూ సస్పెండ్ అయిన సభ్యుడు డెరెక్ ఓ బ్రెయిన్‌కు మరో అవకాశమిస్తున్నా' అని అన్నారు. నిబంధనలకు కట్టుబడాలని, సభ కార్యకలాపాలను అడ్డుకోవద్దన్నారు. తన చాంబర్‌లో సమావేశానికి పిలిస్తే ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే అయిష్టత ప్రదర్శించారని, ఇది బాధించిందన్నారు. సస్పెండ్ చేసినప్పటికీ డెరెక్ ఓ బ్రెయిన్ సభలోనే కనిపించారన్నారు. గోయల్‌తో పాటు వచ్చిన తన చాంబర్‌లో కలవాలని ఖర్గేను ధన్కర్ కోరారు. ఆపై సభను సాయంత్రం 4 గంటల వరకు వాయిదా వేశారు. అంతకుముందు డెరెక్ ఓ బ్రెయిన్ సస్పెన్షన్‌పై చర్చ కోసం ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. భద్రతా వైఫల్యంపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభలో ప్రకటన చేయాలని డిమాండ్ చేశాయి. దీంతో సభలో గందరగోళం నెలకొంది. చైర్మన్ వెంటనే సభ నుంచి వెళ్లిపోవాలని డెరెక్ ఓ బ్రెయిన్‌ను ఆదేశించారు కానీ విపక్ష ఎంపీలు అలా జరగనివ్వకుండా ఆందోళనను కొనసాగించారు. సెషన్ మొత్తానికి డెరెక్ ఓ బ్రెయిన్‌ను 256 నిబంధన ప్రకారం సస్పెండ్ చేయాలని తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని పీయూష్ గోయల్‌ను చైర్మన్ ఆదేశించారు. గోయల్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా మూజువాణి ఓటు ద్వారా సభ ఆమోదించింది. దీంతో డెరెక్‌ను సస్పెండ్ చేసినట్లు ధన్కర్ ప్రకటించారు. ఈ పరిణామంతో ప్రతిపక్ష ఎంపీలు మరింత బిగ్గరగా నినాదాలు చేశారు. సస్పెన్షన్‌ను సహించేది లేదని స్పష్టంచేశారు.

ఎనిమిది మంది భద్రతా సిబ్బంది సస్పెన్షన్

న్యూదిల్లీ: పార్లమెంటు భద్రతా వైఫల్యంపై లోక్‌సభ సెక్రటేరియట్ కఠిన చర్యలు చేపట్టింది. ఇద్దరు దుండగులు చొరబడి పసుపురంగు పొగ చల్లే డబ్బాలతో అలజడి సృష్టించిన సమయంలో విధులలో ఉన్న ఎనిమిది మంది భద్రతా సిబ్బందిని సస్పెండ్ చేసింది. పార్లమెంటు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఎంపీలు పార్లమెంట్‌లోకి ప్రవేశించే ద్వారం నుంచి ఇతరులు వెళ్లకుండా నిషేధించారు. మీడియాపైనా ఆంక్షలు విధించారు. సెక్యూరిటీ చెకింగ్‌ల తర్వాతే మీడియా సిబ్బందికి ఎంట్రీ పాస్‌లు ఇస్తున్నారు. ప్రతి ఒక్కరి బూట్లు కూడా స్కాన్ చేస్తున్నారు. ప్రస్తుత సమావేశాలు ముగిసే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు.

నిందితుడి తండ్రి అడిగితే ఎంట్రీ పాస్ ఇచ్చా

బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహ

న్యూదిల్లీ: పార్లమెంట్ భద్రతా వైఫల్యం ఘటనలో నిందితులు కర్నాటకకు చెందిన బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహ కార్యాలయం నుంచి విజిటర్ పాస్‌లు పొందారు. దీంతో స్పీకర్ ఓం బిర్లాను ప్రతాప్ సింహ గురువారం కలిశారు. నిందితులకు పాస్‌లు ఇవ్వడానికి గల కారణాన్ని ఆయన వివరించారు. పార్లమెంట్ విజిటర్ పాస్ కోసం నిందితుల్లో ఒకరి తండ్రి తన కార్యాలయానికి వచ్చారని స్పీకర్‌కు తెలిపారు. పాస్‌ల కోసం నిందితుడు సాగర్ శర్మ నిరంతరం తన పీఏకి టచ్‌లోనే ఉన్నట్లు పేర్కొన్నారు. ఇంతకుమించిన సమాచారం తన వద్ద లేదని స్పీకర్‌కు వివరించినట్లు సమాచారం. మనోరంజన్, సాగర్ శర్మ, నీలమ్, అమోల్ శిందే, విశాల్, లలిత్ అనే ఆరుగురు దుండగులు ఈ ఘటనకు పాల్పడిన విషయం తెలిసిందే. ఇందులో మనోరంజన్, సాగర్‌శర్మ లోక్‌సభలోకి చొరబడగా... నీలమ్, అమోల్ శిందే పార్లమెంట్ భవనం వెలుపల గందరగోళం సృష్టించారు. ఈ నలుగురితో పాటు వీరికి సహకరించిన విశాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోగా లలిత్ పరారీలో ఉన్నాడు.

భద్రతా వలయంలో పార్లమెంటు

న్యూదిల్లీ: లోక్‌సభలో దాడి ఘటనతో పార్లమెంటు ప్రాంగణం... బయట అధికారులు భద్రత పెంచారు. సందర్శకుల అనుమతిని ఇప్పటికే సభాపతి రద్దు చేశారు. పార్లమెంట్ వైపు వెళ్లే ప్రతి వాహనాన్ని, వ్యక్తులను భద్రతా సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. పార్లమెంట్ పాసులు ఉన్న వారికి మాత్రమే పరిసర ప్రాంతాల్లోకి వెళ్లే అవకాశం పోలీసులు ఇస్తున్నారు. పార్లమెంట్ భవనానికి దారి తీసే మార్గాలన్నింటిలో అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు. పార్లమెంటు భద్రత ఉల్లంఘన కేసులో కీలక నిందితుడి కోసం పోలీసుల గాలింపు ముమ్మరంగా కొనసాగుతోంది. పరారీలో ఉన్న లలిత్ ఝా కోసం వెతుకుతున్నారు. దిల్లీ స్పెషల్ సెల్‌కు చెందిన రెండు పోలీసు బృందాలు రాజస్థాన్ నీమ్రానా వద్ద లలిత్ ఝా ఆఖరి లొకేషన్‌గా గుర్తించారు. నిన్నటి నుంచి లలిత్ ఝా కోసం రెండు పోలీస్ బృందాలు రంగంలోకి దిగాయి. కాగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ అట్టహాసంగా నిర్మించిన కొత్త పార్లమెంటు భవనం భద్రతను ప్రశ్నార్థకం చేసే సంచలన ఘటన బుధవారం చోటుచేసుకుంది.

షాహీ ఈద్గాలో సర్వే

అలహాబాద్ హైకోర్టు గ్రీన్ సిగ్నల్

శ్రీకృష్ణ జన్మభూమి కేసులో కీలక పరిణామం



అలహాబాద్: శ్రీకృష్ణ జన్మభూమి కేసుకు సంబంధించి మథురలోని షాహీ ఈద్గా కాంప్లెక్స్‌లో సర్వే నిర్వహించేందుకు అలహాబాద్ హైకోర్టు అనుమతించింది. హిందూపక్షం 'శ్రీ కృష్ణ విరాజ్‌మాన్' తరపున దాఖలైన పిటిషన్ పరిశీలించి కమిషన్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు గురువారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ముగ్గురు న్యాయవాదులను కమిషనర్లుగా నియమిస్తూ కోర్టు నిర్ణయించింది. వివాదాస్పద మసీద్ కాంప్లెక్స్‌లో సర్వే చేపట్టాలంటూ అలహాబాద్ హైకోర్టు సింగిల్ బెంచ్ జస్టిస్ మయాంక్ కుమార్ జైన్ ఆదేశాలు జారీ చేశారు. 'శ్రీ కృష్ణ విరాజ్‌మాన్' తరపున దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపి ఈ ఆదేశాలు ఇచ్చారు. ఈ కేసుకు సంబంధించి మథుర జిల్లా కోర్టు నుంచి బదిలీ అయిన మొత్తం 18 పిటిషన్లను హైకోర్టు పరిశీలించింది. మథుర జిల్లా కోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లు అన్నింటినీ అందించాలని హైకోర్టు కోరింది. షాహీ ఈద్గా మజీద్ కాంప్లెక్స్‌లో అడ్వకేట్ కమిషనర్‌తో సర్వే చేయించాలంటూ తాము దాఖలు చేసిన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు అనుమతించిందని హిందూ పక్షం తరపున వాదనలు వినిపించిన విష్ణు శంకర్ జైన్ చెప్పారు. సర్వేలో అనుసరించాల్సిన పద్ధతులను ఈ నెల 18న ఖరారు చేయనున్నట్టు వెల్లడించారు.

సముద్రంలోకి చమురు లీక్

వేల జలచరాల మృత్యువాత

చెన్నై: చెన్నై పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ శుద్ధి కర్మాగారం నుంచి చమురు లీకై సముద్రంలో కలవడంతో వేల సంఖ్యలో జలచరాలు ప్రాణాలు కోల్పోయాయి. గతవారం కురిసిన భారీ వర్షాల ప్రభావంతో కర్మాగారంలోని చమురు నిల్వలు వరద నీటితో నిండిపోయాయని, అవికాస్తా పొంగి పొర్లడంతో పక్కనే ఉన్న కోసస్తలైయార్ నదిలోకి... అక్కడి నుంచి సముద్రంలో కలిసి పోయాయని పోలీసులు తెలిపారు. దీంతో వేల సంఖ్యలో చేపలు మృత్యువాతపడ్డాయన్నారు. సముద్రంలో 20 కి.మీ.ల మేర ఎటు చూసినా చమురు తెట్టలు కనిపిస్తున్నాయి. హాట్‌స్పాట్‌లు గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సీపీసీఎల్ అధికారులను ఆదేశించింది. కంపెనీ నుంచి ఆయిల్ ఎందుకు లీక్ అయిందో దర్యాప్తు చేయాలని కోరింది. ఆస్తి నష్టం లేదా అనారోగ్యానికి గురైన వారికి పరిహారం అందించడానికి తాము కృషి చేస్తున్నామని అధికారులు తెలిపారు. మిచౌంగ్ తుపాను కారణంగా వచ్చిన వరదల్లో చమురుతో కూడిన కలుషిత నీరు చాలామంది ఇళ్లలోకి ప్రవేశించాయి. ఈ నీటితో ప్రజలు శ్వాసకోశ సమస్యలు, చర్మంపై దద్దుర్లు, ఇన్ఫెక్షన్లతో బాధపడ్డారు.

ఆ ముగ్గురు ఎమ్మెల్యేలకు షోకాజ్ నోటీసు ఇస్తాం

కర్నాటక బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర

బెలగావి: కర్నాటకలో ముగ్గురు బీజేపీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ విందు సమావేశానికి హాజరు కావడం సంచలనం రేపింది. దీంతో వీరు 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారన్న ఊహాగానాలు గుప్పుమన్నాయి. ఈ విషయమై కర్నాటక బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర గురువారం స్పందిస్తూ... కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశం ముగిసిన తర్వాత తమ పార్టీ శాసనసభ్యులు ముగ్గురు ఆ పార్టీ ఏర్పాటు చేసుకున్న విందుకు హాజరుకావడం తీవ్రమైన విషయమని పేర్కొన్నారు. దీనిపై సదరు ఎమ్మెల్యేల నుంచి వివరణ కోరతామని స్పష్టం చేశారు. కాగా ముగ్గురు బీజేపీ ఎమ్మెల్యేలు ఎస్టీ సోమశేఖర్ ,శివరామ్ హెబ్బార్, ఎమ్మెల్సీ హెచ్ విశ్వనాథ్ ఏ సమావేశంలోనూ పాల్గొనలేదని, తన ఆహ్వానం మేరకు బుధవారం రాత్రి విందుకు మాత్రమే హాజరయ్యారని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. 2019లో బీజేపీకి ఫిరాయించిన 17 మంది కాంగ్రెస్-జేడీఎస్ శాసనసభ్యులలో ఈ ముగ్గురూ ఉన్నారు. ఈ పరిమాణం హెచ్‌డీ కుమారస్వామి నేతృత్వంలోని ప్రభుత్వ పతనానికి, ఆ తర్వాత బీజేపీ అధికారంలోకి రావడానికి కారణమైన సంగతి తెలిసిందే. గత బీజేపీ ప్రభుత్వంలో సోమశేఖర్, హెబ్బార్ మంత్రులుగా ఉన్నారు.

సోమశేఖర్, హెబ్బార్‌లు కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరారు. విశ్వనాథ్... వాస్తవానికి కాంగ్రెస్‌వాది. 2019లో బీజేపీలోకి ఫిరాయించినప్పుడు జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు. 'ఉదయం నాకు దాని గురించి సమాచారం వచ్చింది. నేను ఈరోజే వారితో మాట్లాడతాను, వారి ఉద్దేశం ఏమిటో చర్చిస్తాను. ఇది తీవ్రమైన విషయం' అని విజయేంద్ర ఇక్కడ విలేకరులతో అన్నారు. శివకుమార్ మాట్లాడుతూ... 'నేను వ్యక్తిగతంగా విందు ఇచ్చాను. దాని కోసం కొంతమంది ఇతర పార్టీ నాయకులను కూడా ఆహ్వానించాను. కాబట్టి వారు (సోమశేఖర్, హెబ్బార్), విశ్వనాథ్, ఇతరులు దాదాపు పది మంది వచ్చారు' అని తెలిపారు. వారు మా పార్టీ శాసనసభ్యులు కాదని, వారు శాసనసభా పక్ష సమావేశానికి రాలేదు, భోజనానికి మాత్రమే వచ్చి వెళ్లారని వివరించారు.

ఏసీ కోచ్‌ల నుంచి దుప్పట్లు, బెడ్‌షీట్లు చోరీ

న్యూదిల్లీ: గత రెండు నెలల్లో ఏసీ రైలు బోగీల నుంచి లక్షల విలువైన దుప్పట్లు, బెడ్ షీట్లు, దిండ్లు, ఇతర వస్తువులు చోరీకి గురయ్యాయని ప్రభుత్వ రైల్వే పోలీసు అధికారులు తెలిపారు. ఏసీ కోచ్‌లో ప్రయాణించే ప్రయాణికులకు దుప్పట్లు, దిండ్లు వంటి వస్తువులను రైల్వేశాఖ ఉచితంగా అందిస్తుంది. కొందరు ప్రయాణికులు వారి ప్రయాణం పూర్తయిన తరువాత ఆ దుప్పట్లు మడిచి బ్యాగులో వేసుకొని వెళ్లిపోయే సంఘటనలు చాలానే ఉన్నాయి. ప్రయాణికులు కాకుండా ఏసీ కోచ్ అటెండర్లు కూడా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి సంఘటనలు ఎక్కువగా భోపాల్‌లో జరిగినట్లు సమాచారం. భోపాల్ నుంచి దిల్లీకి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లలో ఇలాంటి చోరీలు జరిగాయని అధికారులు తెలిపారు. భోపాల్ ఎక్స్‌ప్రెస్, రేవాంచల్ ఎక్స్‌ప్రెస్, మహామన ఎక్స్‌ప్రెస్, హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ గమ్యస్థానానికి చేరుకోవడానికి సుమారు 12 గంటల కంటే ఎక్కువ సమయం పడుతుండటంతో ఇలాంటి దొంగతనాలు ఎక్కువగా జరిగాయి. అన్ని రైళ్లలో 12 కోచ్‌లు, ఇద్దరు అటెండర్లు మాత్రమే ఉంటారు. వారు రాత్రి సమయంలో పడుకునే సందర్భంలో మధ్యలో దిగిపోయేవారు ఇలాంటి చర్యలకు పాల్పడి ఉంటారని చెబుతున్నారు. కేవలం గత రెండు నెలల్లో రైళ్లలో రూ.2.65 లక్షల విలువైన 1,503 బెడ్‌షీట్లు, రూ.1.9 లక్షల విలువైన 189 దుప్పట్లు, రూ.10 వేలకు పైగా విలువ చేసే 326 దిండ్లు చోరీకి గురైనట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు ఇలాంటి చర్యలకు పాల్పడే వ్యక్తులపై పెద్దగా చర్యలు తీసుకోలేదని, చోరీలను ఆపడానికి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సంబంధిత అధికారులు వెల్లడించారు.

మహారాష్ట్రలో 2366 మంది రైతుల ఆత్మహత్య

నాగపూర్: మహారాష్ట్రలో రైతుల ఆత్మహత్యలు రోజురోజుకు పెరుగుతున్నాయి. గడిచిన పది నెలల్లోనే 2వేలకు పైగా రైతుల బలవన్మరణాలు చోటుచేసుకున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబర్ వరకు రాష్ట్రవ్యాప్తంగా 2366 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు స్వయానా మహారాష్ట్ర ప్రభుత్వమే వెల్లడించింది. వీటిలో అమరావతి డివిజన్‌లోనే అత్యధికంగా రైతులు బలవన్మరణాలకు పాల్పడినట్లు తేలింది. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబర్ వరకు రాష్ట్రవ్యాప్తంగా 2366 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రభుత్వానికి నివేదిక అందింది. ఇందులో అత్యధికంగా అమరావతి డివిజన్‌లోనే 951 మంది రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు.

ఛత్రపతి శంభాజీనగర్ డివిజన్‌లో 877, నాగపూర్ డివిజన్‌లో 257, నాసిక్ డివిజన్‌లో 254, పూనె డివిజన్‌లో 27 మరణాలు నమోదయ్యాయని రాష్ట్ర సహాయ, పునరావాస శాఖ మంత్రి అనిల్ భైదాస్ వెల్లడించారు. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలకు సంబంధించి కాంగ్రెస్ సభ్యుడు కునాల్ పాటిల్ అడిగిన ప్రశ్నకు అసెంబ్లీలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. బాధిత కుటుంబీకులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు.

అంతా విద్యావంతులే...

లోక్‌సభలో దాడి నిందితుల నేపథ్యం



న్యూదిల్లీ: లోక్‌సభలోకి ఆరుగురు ఆగంతకులు చొరబడి సృష్టించిన అలజడి యావత్తు దేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఒక్కసారిగా 22 ఏళ్ల క్రితం పార్లమెంటుపై ఉగ్రవాదులు దాడికి యత్నించిన ఉదంతం కళ్లముందు మెదిలింది. రెండు దశాబ్దాల కిందట జరిగిన దాడే మాయని మచ్చలా చాలాకాలం వెంటాడింది. అది మరువక మునుపే కొత్తగా ఆధునాతన హంగులతో తీర్చిదిద్దిన పార్లమెంటు వద్ద మళ్లీ అలాంటి కల్లోలం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. పార్లమెంటు ప్రాంగణం లేదా బయట వైపు కాకుండా ఏకంగా దిగువసభలోకే ఆగంతకులు చొరబడటం పార్లమెంట్‌లోని భద్రతా వైఫల్యం గురించి అనుమానాలు లేవనెత్తింది. ప్రధాని నరేంద్ర మోదీ ఈ కొత్త పార్లమెంట్‌ను తీర్చిదిద్దిన విధానం గురించి గొప్పగా ప్రచారం చేసుకున్నారు. పార్లమెంట్‌లోకి చొరబడ్డ ఆ ఆగంతకుల్లో కొందరి నేపథ్యం మామూలుగా లేదు. నిందితులు ఉన్నత విద్యావంతులు. వారి గురించి తెలుసుకుందాం...

పార్లమెంటు ఆవరణలో పొగ గొట్టాలు విసిరి పట్టుబడ్డ వారిని హరియాణాలోని హిస్సార్‌కు చెందిన నీలమ్ (42), మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన అమోల్ షిండే (25)గా గుర్తించారు. వీరికి, మనోరంజన్, సాగర్‌లకు లలిత్, విశాల్ అనే మరో ఇద్దరు సహకరించినట్టు దిల్లీ పోలీసులు తేల్చారు. వీరందరికీ కనీసం నాలుగేళ్లుగా పరిచయముందని, సోషల్ మీడియా ద్వారా టచ్‌లో ఉండేవారని చెబుతున్నారు. పట్టుబడ్డ నిందితుల్లో నీలమ్ రీసెర్చ్ ప్రోగ్రాంలో ఎంఫిల్ పూర్తి చేసింది. టీచింగ్ ఉద్యోగం కోసం నిర్వహించే సెంట్రల్ ఎగ్జామినేషన్‌లో ఉత్తీర్ణురాలైంది. కానీ ఉద్యోగం లేదు. ఉన్నత విద్యావంతురాలైనప్పటికీ ఉద్యోగం రాకపోవడంతో నీలమ్ తీవ్ర ఒత్తిడికి గురైనట్లు ఆమె కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఆమెకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని అంటున్నారు. నీలమ్ పోటీపరీక్షల శిక్షణ కోసం హరియాణాలో జింద్‌కు వెళ్లినట్లు తెలిపారు. ఆమె బీఏ, ఎంఏ, ఎంఫిల్ పూర్తి చేసింది. పైగా నెట్‌లో కూడా మంచి ఉత్తీర్ణత సాధించింది. మరో నిందితుడు మనోరంజన్(34) మైసూర్‌కి చెందినవాడు. కంప్యూటర్ ఇంజినీరింగ్‌లో గ్రాడ్యుయేట్. అతడి తండ్రి దేవరాజేగౌడ మాట్లాడుతూ... తన కొడుకు ఏదైనా తప్పు చేసి ఉంటే ఉరి తీయాలని అన్నారు. పార్లమెంటు అందరిదీ... మహాత్మాగాంధీ నుంచి జవహర్‌లాల్ నెహ్రూ వరకు చాలామంది ఆ ఆలయాన్ని నిర్మించారు. తన కొడుకు అయినా...ఎవరైనా ఇలా ప్రవర్తించడం ఆమోదయోగ్యం కాదని తండ్రి పేర్కొనడం గమనార్హం. నీలం అజాద్‌తో కలిసి పార్లమెంట్ వెలుపల పొగ గొట్టలు విసిరిన అమోల్ షిండే మహారాష్ట్రలోని లాతూర్ గ్రామానికి చెందిన వాడు. అతడి తల్లిదండ్రులు కూలీలు. పోలీసు, ఆర్మీ రిక్రూట్‌మెంట్ వంటి పోటీ పరీక్షల్లో చాలాసార్లు విఫలమయ్యాడని అతడి తల్లిదండ్రులు తెలిపారు. అతను పోలీస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ పేరుతో ఇంట్లో నుంచి వెళ్లినట్లు చెబుతున్నారు. అలాగే లక్నో నివాసి, సాగర్ శర్మ, అతనితో సహా అతని కుటుంబంలో నలుగురు సభ్యులు ఉన్నారు. శర్మ జీవనోపాధి కోసం ఇ-రిక్షా కూడా నడుపుతున్నాడు. నిరసనలో పాల్గొనేందుకు రెండు రోజుల పాటు దిల్లీకి వెళతానని చెప్పినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. చివరిగా ఆ నిందితులకు ఇంట్లో ఆశ్రయం ఇచ్చిన విక్కీ శర్మ అతడి భార్య రేఖను కూడా అదుపులోకి తీసుకున్నారు. విక్కీ ఎగుమతుల కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వారందరిపై పోలీసులు ఉగ్రవాద నిరోధక చట్ట కింద కేసులు నమోదు చేశారు.

మంచు గుప్పెట్లో కశ్మీర్

శ్రీనగర్: జమ్మూ-కశ్మీర్ మంచు గుప్పెట్లో చిక్కుకుంది. చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలకు పడిపోయాయి. కశ్మీర్ లోయ వ్యాప్తంగా తీవ్రమైన చలిగాలులు వీస్తుండటంతో దాల్ సరస్సు సహా కొన్ని నదులు గడ్డకట్టాయి. మంచినీటి పైపులు సైతం గడ్డకట్టడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. శ్రీనగర్‌లో బుధవారం రాత్రి కనిష్టంగా మైనస్ 5.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైందని, దీంతో ఈ సీజన్‌లో అత్యంత శీతల రాత్రిగా నమోదైనట్లు అధికారులు గురువారం తెలిపారు. మంగళవారం రాత్రి నమోదైన ఉష్ణోగ్రత కన్నా కొంచెం తక్కువని అన్నారు. నగరంలో ఈ శీతాకాలంలో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రత ఇదేనని అధికారులు తెలిపారు. అమర్‌నాథ్ యాత్రకు బేస్ క్యాంప్ ప్రాంతమైన దక్షిణ కశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా పెహల్గాంలో మైనస్ 5.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, బారాముల్లా జిల్లాలోని గుల్మార్గ్‌లో అత్యంత కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 5 డిగ్రీలుగా రికార్డయినట్లు అధికారులు తెలిపారు. ఖాజిగుండ్‌లో మైనస్ 3.8 డిగ్రీల సెల్సియస్, కొకెర్‌నాగ్ పట్టణంలో మైనస్ 1.6 డిగ్రీల సెల్సియస్, కుప్వారాలో మైనస్ 4.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. డిసెంబర్ 15 వరకు వాతావరణం పొడిగా ఉంటుందని, అయితే వారాంతంలో తేలికపాటి వర్షపాతం ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

విపత్తుకూ స్పందించరా ?

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:

మిచౌంగ్ తుపానుకు తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని తక్షణం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు గురువారం రాష్ట్రవ్యాప్తంగా ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో పార్టీల కతీతంగా రైతు సోదరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట మొత్తం సర్వనాశనమైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఏమాత్రం చలనం లేకపోవడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతకంటే ఘోర విపత్తు ఏముంటుందని ప్రశ్నించారు. రైతు సంక్షేమమే మా లక్ష్యమంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు చేసే ప్రధాని మోదీ, సీఎం జగన్‌ల చిత్తశుద్ధి ఏమిటో తేటతెల్లమైందని విమర్శించారు. ఇకనైనా పాలకులు స్పందించి పంట నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని, లేనిపక్షంలో అన్నదాత ఆగ్రహం చవి చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. సీపీఐ పిలుపులో భాగంగా తిరుపతి జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ మాట్లాడుతూ తుపాను ప్రభావంతో రాష్ట్రంలో 18 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. ప్రతి రైతుకు ఎకరాకు రూ.30 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇళ్లను కోల్పోయిన నిరుపేదలకు వెంటనే ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తుపాను నష్టాన్ని ఇంతవరకు అంచనా వేయక పోవడం శోచనీయమన్నారు. 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ని నియమించిన జగన్, ఆ 50 ఇళ్లలో ఎంతమంది నష్టపోయారో అంచనా వేయడం కష్టతరమా? అని ప్రశ్నించారు. స్పష్టమైన అంచనాలు లేకపోవడంతో కేంద్రాన్ని సైతం డిమాండ్ చేసే స్థితిలో జగన్‌మోహన్ రెడ్డి లేరని ఎద్దేవా చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రెడ్ కార్పెట్ పైనుండి దెబ్బతిన్న పంటలను పరిశీలించడం ఏమిటని ప్రశ్నించారు. ఒకవైపు తుపాను ప్రభావంతో రైతులు నష్టపోగా మరోవైపు కరువుతో అల్లాడుతూ నష్టపోతున్నారని పేర్కొన్నారు. రెండు విధాల నష్టపోయిన రైతాంగాన్ని, ప్రజలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు స్పందించకుంటే రాష్ట్ర బంద్‌కి వెనకాడబోమని స్పష్టం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, నగర కార్యదర్శి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సమితి అధ్వర్యంలో లో విజయవాడ లెనిన్ సెంటర్‌లో అఖిలపక్షం, రైతు సంఘాలు, ప్రజాసంఘాలు చేపట్టిన ధర్నాలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ కరువు, తుపానులతో పంట నష్టపోయిన రైతాంగాన్ని, గ్రామీణ ప్రజలను ఆదుకోవటానికి కేంద్రం ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. మిచౌంగ్ తుపానుతో రాష్ట్రంలో 11 లక్షల ఎకరాల్లో పంట దెబ్బ తిన్నట్లు రాష్ట్ర ప్రభుత్వమే పేర్కొందన్నారు. లక్షలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని కోట్లాది రూపాయల పెట్టుబడిని రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 470 కరువు మండలాలు ఉంటే కేవలం 143 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించి చేతులు దులుపుకుందని విమర్శించారు. అధికారంలోకి రాకముందు గ్రామీణ ప్రాంతాల్లో పాదయాత్రలు చేసి తలమీద చేతులు వేసి ముద్దులు పెట్టిన జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత రైతులను అంటుకోవటానికి సిగ్గుపడుతున్నారని మండిపడ్డారు. పంట నష్టాన్ని పరిశీలించటానికి వెళ్లిన ముఖ్యమంత్రి స్టేజ్‌పై నిలబడి ఉంటే జాయింట్ కలెక్టర్ మాత్రం పొలంలో దిగి పంటను చూపిస్తే చూసివెళ్లటంలో ఆయన నైజం తేటతెల్లమైందన్నారు. జగన్ ప్రభుత్వం రైతాంగం పట్ల, గ్రామీణ ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి ఆదుకోవాలని, రైతుల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కరువు, తుపాను ప్రభావిత ప్రాంతంల్లో విద్యార్థులకు ఫీజుల మాఫీ, గ్రామీణపేదలకు ఉపాధి కల్పించాలని కోరారు. డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు అవసరమైతే ఢిల్లీస్థాయిలో ఉద్యమించటానికి రైతులు, ప్రజానీకం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ రైతాంగాన్ని ఆదుకోవాలని అనేకసార్లు ఉద్యమాలు చేసినా స్పందించకుండా కేంద్ర బృందాలు వస్తున్న నేపథ్యంలో వ్యవసాయశాఖ అధికారులు, డైరెక్టర్లు మాత్రమే స్పందించటం శోచనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్. కోటేశ్వరరావు, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, రైతు సంఘం జిల్లా కన్వీనర్ మల్నీడి యల్లమందారావు, ఆమ్‌ఆద్మీపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జీఎస్.ఫణిరాజ్, జిల్లా తెలుగు రైతు సంఘం అధ్యక్షులు చెరుకూరి రాజేశ్వరరావు, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర నాయకులు ఎస్‌కే.ఖాదర్‌భాషా, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర నాయకులు డి.హరినాథ్, రైతు కూలి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు.వీరబాబు, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్ట రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి: ముప్పాళ్ల, ఓబులేసు

రాష్ట్రంలో మిచౌంగ్ తుపాను, కరువు బాధిత రైతాంగానికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జి.ఓబులేసు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పల్నాడు జిల్లా నరసరావుపేటలో అఖిలపక్షాలు, ప్రజాసంఘాల అధ్వర్యంలో తుపాను ధాటికి పంటలు నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము, అధ్యక్షులు తాళ్లూరి బాబురావు, తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు కామినేని రామారావు, జై భీమ్ భారత్ పార్టీ జిల్లా నాయకులు గోదా జాన్ పాల్, ఎంఐఎం జిల్లా నాయకులు షేక్ మస్తాన్ వలి, పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు వి.కోట నాయక్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సుబ్బారావు, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం ఎలా ఉన్నా ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేయాలి: జల్లి విల్సన్

తుపాను ధాటికి నేల వాలి నీట మునిగిన ధాన్యాన్ని రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వ ధరకే కొనుగోలు చేయాలని మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్ తెలిపారు. రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బాపట్ల కలెక్టరేట్ రోడ్‌లో బుధవారం సీపీఐ జిల్లా సమితి అధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు పెద్ద ఎత్తున రైతులు, కౌలు రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జల్లి విల్సన్ మాట్లాడుతూ మిచౌంగ్ తుపాను ప్రభావంతో రాష్ట్రంలో రైతులు, కౌలు రైతులు, కూలీలు తీవ్రంగా నష్టపోయారని, వ్యవసాయరంగం అస్తవ్యస్తంగా మారిందన్నారు. తుపాను చేసిన నష్టం వల్ల రైతులు రైతు కూలీలు, కౌలు రైతులకు క్లిష్ట పరిస్థితి ఏర్పడిందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జేబీ శ్రీధర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్, ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నాయకులు పర్రె కోటయ్య, నల్లమడ రైతు సంఘం నాయకులు రిటైర్డ్ ప్రొఫెసర్ విజయ్ కుమార్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు గుదే రాజారావు తదితరులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలి: అక్కినేని వనజ, దేగా ప్రభాకర్

మించౌంగ్ తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు దేగా ప్రభాకర్‌లు డిమాండ్ చేశారు. మిచౌంగ్ తుపాను వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తుపాను ప్రభావం వలన వరి, చెరకు, పొగాకు, మినుము, పెసర, పత్తి, మిర్చి, ఉద్యాన పంటలు 60 శాతానికి పైగా దెబ్బతిని పంట చేతికి అందకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్, జనసేన నాయకులు రెడ్డి అప్పలనాయుడు, ఘంటశాల వెంకటలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు దండుబోయిన చంద్రశేఖర్, వ్య.కా.సం నేతలు బండి వెంకటేశ్వరరావు, బత్తుల వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు లక్ష్మణరావు, దొంత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి: ఈశ్వరయ్య డిమాండ్

రాష్ట్రంలో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులను జాతీయ విపత్తుగా గుర్తించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జీ ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కరువు మండలాలను పారదర్శకంగా గుర్తించాలని, మిచౌంగ్ తుపాను తో నష్టపోయిన రైతాంగానికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ప్రకాశం జిల్లా సమితి అధ్వర్యంలో ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రావు అధ్యక్షత వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్ నారాయణ, చుండూరి రంగారావు, కాంగ్రెస్ నాయకులు శ్రీపతి ప్రకాశం, సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు పీవీఆర్ చౌదరి, జి.రమేశ్, ఎంఎల్ నాయకురాలు లలిత కుమారి, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కరవది సుబ్బారావు, రైతు నేత వడ్డే హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల రుణాలను రద్దు చేయాలి: కేవీవీ ప్రసాద్

రైతులు, కౌలు రైతుల రుణాలను పూర్తిగా రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం మచిలీపట్నంలోని కృష్ణా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చౌక్ లో జరిగిన అఖిలపక్ష ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... గత నాలుగు సంవత్సరాలుగా వర్షాలకు పంట కొట్టుకోపోవడం జరుగుతోందని, ఈ సంవత్సరం అలా కాకుండా పంట పూర్తిగా నీటమునిగి ధాన్యం మొక్క రావడం వల్ల స్థానికంగా వాటిని కొనే నాథుడు లేడన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి టి. తాతయ్య, పట్టణ ప్రధానకార్యదర్శి లింగం ఫిలిప్, తెలుగు రైతు కృష్ణా జిల్లా అధ్యక్షులు గోపు సత్యనారాయణ, రైతు కూలీ సంఘం అధ్యక్షుడు జగన్, బీఎస్పీ పట్టణ ఇంచార్జ్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి: జంగాల

మిచౌంగ్ తుపాను, కరువు వల్ల దెబ్బతిన్న పొలాల రైతులకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. తుపాను, కరువుతో దెబ్బతిన్న రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ జిల్లా సమితి అధ్వర్యంలో నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షతన గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ శ్రేణులు, రైతు సంఘ నాయకులు, రైతులు ధర్నా నిర్వహించారు. ధర్నాకు టీడీపీ, జనసేన, సీపీఎం, తదితర రైతుసంఘాలు సంఘీభావం తెలిపాయి. జిల్లా టీడీపీ అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్, జిల్లా జన సేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, వివిధ రైతు సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం డీఆర్వో చంద్రశేఖర్‌రావుకి వినతిపత్రం అందజేశారు. వెలుగూరి రాధాకృష్ణమూర్తి, చిన్ని తిరుపతయ్య, పి.మాణిక్యాలరావు, పచ్చల శివాజీ, కంచుమాటి అజయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ఫలించని చర్చలు

- 27 నుంచి మున్సిపల్ సమ్మె యథాతథం
- మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:

మున్సిపల్ సమ్మె ఈ నెల 27 నుంచి యథాతథంగా కొనసాగుతుందని మున్సిపల్ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) రాష్ట్ర కన్వీనర్ పోరుమామిళ్ల సుబ్బరాయుడు, కో కన్వీనర్లు వైవీ రమణ, ఆసుల రంగనాయకులు, శ్యామ్ స్పష్టం చేశారు. గురువారం రాష్ట్ర సచివాలయంలోని ఎంఏయూడి భవనంలో మున్సి పల్ కార్మిక సంఘాల జేఏసీలతో స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి, మున్సిపల్ డైరెక్టర్ కోటేశ్వరరావు, జాయింట్ డైరెక్టర్లు పూర్ణచంద్రరావు, గోపాలకృష్ణారెడ్డి చర్చలు జరిపారు. కాంట్రాక్టు సిబ్బందిని ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసిందని, వారితోపాటు రెండు మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేసే విషయంపై సీఎం జగన్ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని శ్రీలక్ష్మీ తెలిపారు. దీంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులను పర్మినెంట్ చేసేంతవరకు కనీస వేతనాలు రూ.20 వేలను బేసిక్ డీఏ, హెచ్‌ఆర్‌ఏ కలిపి ఇవ్వాలని జేఏసీ నేతలు కోరారు. జీవో నెంబర్ 308 సవరించి నాటి కార్మిక శాఖ ఇచ్చిన నివేదిక ఆధారంగా స్కిల్డ్, అన్ స్కిల్డ్, సూపర్ వైజర్ల వేతనాలు చెల్లించాలని... జీవో నెంబర్ 212 ప్రకారం టైం స్కేల్ ఉద్యోగ, కార్మికుల వేతనాల పెంపు విషయం, కరోనా విపత్తులో పారిశుధ్య పనులకు తీసుకున్న కార్మికులను యథాతథంగా కొనసాగించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ప్రమాదాల బారినపడి మరణించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వర్కర్ల కుటుంబాలకు రూ.30 లక్షల పరిహారం చెల్లించాలని కోరారు. శ్రీలక్ష్మీ మాట్లాడుతూ... అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వర్కర్లు, డ్రైవర్లకు ఇంజినీరింగ్ ఒప్పంద సిబ్బందికి, పార్క్ వర్కర్లకు టాయిలెట్ వర్కర్లకు రూ.6వేలను శుక్రవారం సీఎం జగన్ ప్రకటిస్తారని, స్కిల్డ్,అన్ స్కిల్డ్ వేతనాలు చెల్లింపు పై రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. కరోనా సమయంలో తీసుకున్న కార్మికులను కొనసాగిస్తామని, కంటింజెంటీ వర్కర్లను టైమ్ స్కేల్ ఉద్యోగ కార్మికులను పర్మినెంట్ చేస్తామని, హెూల్డ్ లో ఉన్న హెల్త్ కార్డులు విడుదల చేస్తామని, ఓపెన్ కెనాళ్లలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీలో 62 సంవత్సరాలు వరకు ఒప్పంద కార్మికులను తొలగించబోమని, మున్సిపల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగ కార్మికులకు గ్రాట్యుటీ చెల్లింపు అంశంపై సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. మున్సిపల్ జేఏసీ సమ్మె ఆలోచన విరమించుకోవాలని తెలిపారు. అయితే సీఎంతో ప్రకటన చేయించి, మినిట్స్ కాపీ అందజేస్తేనే మున్సిపల్ సమ్మె విషయం ఆలోచిస్తామని జేఏసీ నేతలు స్పష్టం చేశారు. ఈ చర్చల్లో ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్ల యూనియన్ రాష్ట్ర నాయకులు తులసేంద్ర, నెక్కంటి సుబ్బారావు, కోటి దాసు, దొరసామి, తారక రామారావు, వైఎస్ఆర్టీసీయూ నాయకులు ఆనంద్, టీఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు శ్యామ్ పాల్గొన్నారు.

వామపక్షాల ఐక్యకార్యాచరణ తక్షణ అవసరం

రెడ్ ఫ్లాగ్ జాతీయ కార్యదర్శి ఎంఎస్ జయకుమార్

విశాలాంధ్ర–విజయవాడ:

దేశంలో మతతత్వ శక్తులను ఓడించేందుకు వామపక్షాల ఐక్య కార్యాచరణ తక్షణ అవసరమని ఎంఎల్‌పీఐ(రెడ్ ఫ్లాగ్) జాతీయ ప్రధానకార్యదర్శి ఎంఎస్ జయకుమార్ ఉద్ఘాటించారు. రెడ్ ఫ్లాగ్ 10వ జాతీయ మహాసభలు స్థానిక చాంద్ కల్యాణమండపంలో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస్ రావు, సీపీఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ సభ్యులు గుర్రం విజయ్‌కుమార్, రివల్యూషనరీ ఇన్షియేటీవ్ కేంద్ర కమిటీ కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాకూర్, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటరెడ్డి సౌహార్ద సందేశాలు ఇచ్చారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడానికి వామపక్షాల ఐక్య కార్యాచరణ తక్షణ అవసరమని వ్యాఖ్యానించారు. సభకు జాతీయ కార్యవర్గ సభ్యులు థామస్ ఫ్రెడీ అధ్యక్షత వహించారు. ముందుగా కేంద్ర కమిటీ కార్యవర్గ సభ్యులు బసవలింగప్ప ఆహ్వానం పలికారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మహాసభల్లో పాల్గొన్నారు. తొలుత ఎర్రజెండాను ఆవిష్కరించారు. అమర కళకారుల వేదిక బృందం, డోలక్ యాదగిరి, విప్లవ గేయాలతో మహాసభలు ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మహాసభల ఏర్పాట్లను రాష్ట్ర కార్యదర్శి మరీదు ప్రసాద్ బాబు పర్యవేక్షిస్తున్నారు.

రాజ్యాంగ హక్కుల కోసమే సుప్రీంను ఆశ్రయించాం

కొట్టాయం:

కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కేరళను తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. రాష్ట్రానికి రాజ్యాంగబద్ధ హక్కులను పునరుద్ధరించేందుకే తమ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిందని ఆయన స్పష్టం చేశారు. కేరళను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టిన కేంద్రం రాజ్యాంగ విరుద్ధ, చట్టవిరుద్ధ చర్యలకు వ్యతిరేకంగా వామపక్ష ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించిన ఒక రోజు తర్వాత విజయన్ ప్రకటన వెలువడింది. రాష్ట్ర ప్రభుత్వం పట్ల వివక్షాపూరిత చర్యలను విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి పదేపదే సంప్రదింపులు చేసినప్పటికీ పట్టించుకోకుండా తన ప్రతీకార చర్యలను తీవ్రతరం చేసిందని, దీనివల్ల కేరళ మనుగడ కష్టమని విజయన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఇక్కడకు వచ్చిన విజయన్ ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక స్వయంప్రతిపత్తిని కేంద్రం ఆక్రమించడాన్ని అరికట్టకుంటే కేరళ ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడుతుందని సీఎం హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించే వరకు

అంగన్‌వాడీల సమ్మె ఆగదు: ఓబులేసు

విశాలాంధ్ర–నరసరావుపేట:

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు మూడు రోజులుగా సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి పట్టడం లేదా అని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ప్రశ్నించారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా అంగన్‌వాడీల సమ్మె ఆగబోదని తేల్చిచెప్పారు. కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంతో చర్చలు విఫలమైనట్లు తెలిపారు. ప్రధానాంశాలు విస్మరించి ఉత్తుత్తి అంశాలపై చర్చ జరిపి సమ్మెను విరమించుకోండని చెబితే సమస్యకు పరిష్కారం ఎలా సాధ్యమని నిలదీశారు. నరసరావుపేట ధర్నాచౌక్‌లోని అంగన్‌వాడీల శిబిరాన్ని ఓబులేసు గురువారం సందర్శించారు. గతంలో మహిళలు ఆందోళన చేశారని గుర్తుచేశారు. గుర్రాలతో తొక్కించుకొని... లాఠీదెబ్బలు తిని... అరెస్టులకు గురైన తమ వేతనాలు, హక్కుల కోసం పోరాడటం అందరికీ తెలుసని ఓబులేసు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా అంగన్‌వాడీలకు న్యాయం చేయాలని కోరారు. అంగన్‌వాడీల ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించి వారి డిమాండ్లను అంగీకరించాలన్నారు. తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి కడియాల వెంకటేశ్వరరావు, డాక్టర్ గౌతమి, రాష్ట్ర అంగన్‌వాడీ కార్యదర్శి లలితమ్మ, కార్యనిర్వాహక అధ్యక్షులు ప్రేమ, సహాయ కార్యదర్శి జె.హెల్డా ఫ్లోరెన్స్, శోభరాణి, సీఐటీయూ నాయకులు మెటల్డా దేవి, మహిళ కన్వీనర్ శివకుమారి, సిలార్, నిర్మల, మాధవి, కవిత, సాయి పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.